
సాంఘిక, ఆర్థిక పోరాటాలు బొమ్మ బొరుసు వంటివి!



వాయిస్ ఆఫ్


# చార్వాక

సామాజిక చైతన్య మాసపత్రిక



సంపుటి : 20 సంచిక : 1 జనవరి – మార్చి 2025

## 33వ జాతీయ నాస్తికమేళా దృశ్యములు



ఆర్. తమిళ్‌సెల్వన్



డా॥ కె. విజయకుమార్



డా॥ వి. బ్రహ్మారెడ్డి



డా॥ కె. శంకర్



డా॥ ఎస్. తిరుపతయ్య



రమేష్ పట్నాయక్



డా॥ సి. హెచ్. దివాకర్‌బాబు



బి. రామయ్య

ప్రచురణ :
చార్వాకాశ్రమం

నాస్తిక సమాజం ? చార్వాక ఆశ్రమం

నిర్వహణ :
నాస్తిక సమాజం

# వాయిస్ ఆఫ్ చార్వాక

జనవరి - మార్చి
2025

గౌరవ సంపాదకులు :**డా॥ భాను ప్రసాద్**

ప్రధాన సంపాదకులు : **బి. సుధాకర్**

సహాయ సంపాదకులు :
జంజనం సత్యనారాయణ
సత్య నిర్ధారణ్
యం.యన్. బుద్ధ
వి.వి.డి.ఎస్. ప్రసాద్
లతీఫ్
కొర్రపాటి హనుమంతరావు
నండూరి నారాయణరావు
నాస్తిక్ శ్రీకాంత్

**రచనలు, అభిప్రాయాలు, విరాళాలు**
పంపవలసిన చిరునామా :
**బి. సుధాకర్**
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),
మంగళగిరి (మండలం)
గుంటూరు జిల్లా - 522 240.
సెల్ : 9290619550, 9440101814
ఎకౌంట్ నెం. 30174955006,
SBI Main Branch, Mangalagiri
IFSC Code : SBIN0001011
Google Pay, Phone Pay : 9290619550
voiceofcharwaka@gmail.com

శాస్త్రీయ స్పృహను
మానవ వాదాన్ని, పరిశీలనాతత్వాన్ని,
సంస్కరణను పెంపొందించటం
ప్రతి భారతీయ పౌరుని విధి,
భారత రాజ్యాంగం
ఆర్టికల్ 51(A)(H) రూల్ IV A.

**పత్రికలో ప్రచురించిన రచనలు ఆయా రచయితల అభిప్రాయాలు మాత్రమే. పత్రిక యాజమాన్యం వారి అభిప్రాయాలతో ఏకీభవించనవసరం లేదు.**

**ఈ సంచికలో...**

| | | |
|---|---|---|
| 1. | భారతీయ నాస్తికవాదం | 3 |
| 2. | జీవపరిణామం, అసమానతలు | 6 |
| 3. | వేదములు - ఒక విమర్శనాత్మక పరిశీలన | 9 |
| 4. | ఆలోచనల బాట! అంజన్నమాట | 13 |
| 5. | మతాన్ని చరిత్ర అంగీకరించదు | 15 |
| 6. | వైద్య విధానంలో గతితార్కిక పద్ధతి హోమియోపతి | 18 |
| 7. | సృష్టికార్య వివరణ-ఆదికాండం | 21 |
| 8. | ఘనంగా జరిగిన 33వ జాతీయ నాస్తికమేళా | 26 |
| 9. | అంతర్జాతీయ మహిళా దినోత్సవం | 35 |
| 10. | మతం గుప్పిట్లో మహిళ | 38 |
| 11. | ఆవు గురించి నిజాలు... అబద్ధాలు, అపోహలు | 40 |

దేవుడికి పొగడ్తలంటే ఆశ
అందుకే భజన్లు చేయమంటాడు
దేవుడికి డబ్బంటే ఆశ
అందుకే హుండీలు వుంచాడు
దేవుడికి నగలంటే ఆశ
అందుకే కిరీటాలు హారాలు ధరిస్తాడు
దేవుడికి బట్టలంటే ఆశ
అందుకే పట్టు వస్త్రాలు కట్టుకుంటాడు
దేవుడికి తిండంటే ఆశ
అందుకే నైవేద్యాలు పెట్టమంటాడు
దేవుడికి భార్యల మీదే ధ్యాస
అందుకే యేటేటా పెళ్ళి చేసుకుంటాడు
ఇన్ని అవలక్షణాలు మనిషి క్కూడా
వుండవేమో!
మరి!
దేవుడు ఎలా అయ్యాడు?

– శివ శేఖర్ కాలేపు

నాస్తిక సాహిత్యం కోసం సంప్రదించండి :
చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు), మంగళగిరి, గుంటూరు జిల్లా - 522 240.
ఫోన్ : 91777 21588, https://charvaka.co.in/

# భారతీయ నాస్తికవాదం

– జి. భార్గవ

క్రీస్తు పూర్వం 6 వ శతాబ్దం నుండి 2 వ శతాబ్దం మధ్యకాలంలో ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో కొత్త రకం నాగరికతలు బయలుదేరాయి. ఈజిప్టు, సుమేరియన్, సింధూ మొదలైన ప్రాచీన నాగరికతలకన్నా ఇవి భిన్నమైనవి. ఈ కొత్త తరహా నాగరికతలను కార్ల్ జాస్పర్స్ అన్న జర్మన్ తత్వవేత్త Axial civilizations అని పిలిచాడు.

వీటిని తెలుగులో శిష్ట నాగరికతలు అని పిలుచుకుందాం. చైనాలో.. కన్ఫ్యూషియస్, టావోయిజం; గ్రీస్‌లో... థేల్స్, అనాక్జిమాండర్, హెరాక్లిటస్, సోక్రటీస్, ప్లాటో; ఇజ్రాయెల్‌లో... ఏకేశ్వర మత స్థాపకులు ఏషయా, ఇర్మియా, ఎజీకిల్; పర్షియాలో... జరాతృష్ట్ర; భారత దేశంలో... ఉపనిషత్తులు, సాంఖ్య, న్యాయ – వైశేషిక, మీమాంస తదితర దర్శనాలు, చార్వాక, గౌతమబుద్ధుడు, మహావీరుడు ఇలా దాదాపు ఒకే కాలంలో ఈ శిష్ట నాగరికతలు అనేక చోట్ల బయలు దేరాయి.

తత్వ చింతన, విశ్వమానవ భావన, ఆదర్శవంతమైన పరలోక భావన, హేతుతర్కం, నైతికవిలువల ప్రాధాన్యత, కేంద్రీకృత రాజ్యవ్యవస్థ మొదలైనవన్నీ ఈ నాగరికతల ప్రత్యేక లక్షణాలు. భారతీయ నాస్తికవాదం కూడా ఈ శిష్ట నాగరికత వికాస క్రమంలోనే పుట్టిందని మీ దృష్టికి తీసుకురావడమే నా ఉద్దేశ్యం.

ఈ విషయంపై లోతైన పరిశోధన చేసిన దేవీప్రసాద్ ఛటోపాధ్యాయ వంటి చరిత్రకారులు ప్రాచీన భారతీయ తత్వశాస్త్రంలో నిరీశ్వరవాదం లేదా నాస్తికవాదం ప్రధాన ధోరణి అనీ, ఈశ్వరవాదం లేదా ఆస్తికవాదం అప్రధాన ధోరణి అని నిరూపించి ఉన్నారు. తొలినాటి సాంఖ్యం ఈశ్వరుడు లేదా దేవుడు అన్న భావనతో అవసరం లేకుండా ప్రకృతి ఉనికిలో ఉన్నదని, ఈశ్వరుడి ప్రమేయం లేకుండానే ప్రకృతి పరిణామం చెందుతూ ఉంటుందని వివరించారు. తొలితరం న్యాయ – వైశేషికులు పదార్థవాదాన్ని, పరమాణువాదాన్ని ప్రతిపాదించారు. పరమాణువులకు కొన్ని మౌలిక ధర్మాలుంటాయని, వీటి పరస్పర సమ్మేళనం నుండే సమస్త వస్తువులు, వాటి రసాయన ధర్మాలు పుడతాయని వివరించారు. అంతేకాక సత్యాసత్య నిర్ధారణకు అవసరమైన తర్కశాస్త్రాన్ని న్యాయదర్శనకారులు అభివృద్ధి చేసారు. చివరకు వైదిక కర్మకాండలను పునరుద్ధరించే ఆశయంతో బయలుదేరిన కర్మ మీమాంస దర్శనకారులు కూడా ఈశ్వరుడి ఉనికిని బలమైన తర్కంతో సవాల్ చేసారు.

బౌద్ధ, జైన ఆచార్యులు దైవభావనతో సంబంధం లేని విశ్వజనీనమైన నైతిక విలువల చట్రాన్ని రూపొందించారు. ఈశ్వరుడి ఉనికిని నిరాకరించారు. ఇక చార్వాకులు పూర్తిస్థాయి భౌతిక వాదులు. దైవ భావననే కాక, వైదిక కర్మకాండలను, మనిషి జీవితేచ్ఛలను అణచివేసే అసాధ్యమైన, హేతువిరుద్ధమైన నైతిక విలువలను కూడా వారు తూర్పార పట్టారు. చార్వాకుల విమర్శనా ఖడ్గం తాకిడికి గురికాని సిద్ధాంతం లేదు. వారు వైదిక, అవైదిక భేదం చూడకుండా

అన్ని రకాల దర్శనాలను, మతాలను, బోధనలను సమానంగా ఛాలెంజ్ చేసారు. అభౌతికమైన, మార్మికమైన, మూఢమైన ప్రతి ఆలోచననూ, ప్రతి నమ్మకాన్నీ, ప్రతి ఆచారాన్నీ చార్వాకులు నిర్దాక్షిణ్యంగా ఎండగట్టారు, హేళన చేసారు. అందుకే చార్వాకులపై బౌద్ధులతో సహా అందరికీ కోపం.

ఇలా భారతీయ శిష్ట నాగరికత దేవుడు అనే భావనను పక్కకు పెట్టి ముందుకుసాగింది. తత్త్వం, తర్కం, నైతికత, వ్యక్తి విముక్తి మొదలైన భావనలు ప్రబలంగా ముందుకు వచ్చిన కాలం అది. అయితే ఈ పరిస్థితి తరువాత కాలంలో తలకిందులైపోయింది. ఈశ్వరుడు లేని సాంఖ్యానికి ఈశ్వరుణ్ణి జత చేసి యోగం అనే కొత్త దర్శనం పుట్టుకొచ్చింది. న్యాయ – వైశేషిక దర్శనాలలోకి ఈశ్వరవాదం చొరబడి పరమాణువాదం, తర్కశాస్త్రం పలచనైపోయింది. నిరీశ్వర కర్మ మీమాంసను పక్కకునెట్టి వేదాంతం అనబడే ఉత్తర మీమాంస దర్శనం పరబ్రహ్మ, వ్యావహారిక ఇష్టదైవం అనే భావనలను బలంగా ముందుకు తెచ్చింది. జైనం వైష్ణవ మతంతో సహజీవనం ప్రారంభించి దేవీదేవతల ఆరాధనలోకి దిగింది. బౌద్ధం ఒకవైపు తాంత్రిక వజ్రయానంగా, మరోవైపు బుద్ధుడిని దేవుడిగా కొలిచే బోధిసత్వ మతంగా పరిణామం చెందింది. శైవ వైష్ణవ మతాలు విస్తృత ప్రజాదరణపొంది దేశమంతా వ్యాపించాయి. రాజాశ్రయంతో విజృంభించాయి.

గుప్త సామ్రాజ్య పతనం తరువాత దేశమంతటా చిన్న రాజ్యాలు ఏర్పడ్డాయి. శైవ, వైష్ణవ మతాలకు చెందిన బ్రాహ్మణ ఆచార్యులకు గురుస్థానం దొరికింది. తత్వశాస్త్రం మూలకు నెట్టివేయబడి మనుస్మృతి లాంటి ధర్మశాస్త్రాల భావజాల పెత్తనం విజృంభించింది. వర్ణవ్యవస్థ కుల వ్యవస్థగా పరిణామంచెంది జనసామాన్యం సాంఘిక అణచివేతకు, ఆర్థిక దోపిడికీ బలైపోయింది. మూఢనమ్మకాలు, మూఢాచారాలు, దాస్య ప్రవృత్తి ప్రజల్లో లోతుగా వేళ్ళూనుకున్నాయి. సుమారు క్రీ.శ. 3వ శతాబ్ది నుండి 15 వ శతాబ్ది వరకూ దేశాన్నంతా ఏకం చేసిన ఒక మహా సామ్రాజ్యమే లేకపోవడం వల్ల, సమాజంపై రాజ్యం యొక్క ప్రభావం సన్నగిల్లి మత ధర్మశాస్త్రాల, మత ఆచారాల, కుల కట్టుబాట్ల ఉక్కు చట్రంలో మనుషులు బందీలైపోయారు. అనేక తాత్విక శాఖలు, జైన, బౌద్ధాలు, మహాకావ్యాలు, తర్క, వ్యాకరణ, అలంకార, భాషాశాస్త్ర, గణిత, ఖగోళ శాస్త్రాలతో దశదిశలా వికాసం చెందుతూ వచ్చిన ఒక శిష్ట నాగరికత సృష్టించిన బౌద్ధిక, తాత్విక, హేతుబద్ధ, వ్యక్తి వికాస ఆవరణం విచ్ఛిన్నమైపోయింది. కుల, మత, పితృస్వామ్య కట్టుబాట్లతో ఊపిరాడని ఒక సాంఘిక ఆవరణమే తప్ప ఉన్నతమైన చింతన, సాహిత్య, కళాసృజనకు అవసరమైన ఒక సజీవ సాంస్కృతిక ఆవరణం వాడిపోయింది.

ఈ ఉక్కపోతలో బ్రాహ్మణాధిపత్యాన్ని ధిక్కరిస్తూ భక్తి ఉద్యమం దేశమంతటా బయలు దేరింది. శ్రామిక, చేతి వృత్తి ప్రజల నుంచీ పుట్టుకొచ్చిన ఈ సాంఘిక – సాంస్కృతిక ఉద్యమం పీడిత ప్రజల నిట్టూర్పుగా, ధిక్కార గీతంగా మొదలై మెల్లమెల్లగా దైవభక్తి అనే ఊబిలోకి ప్రజలను నడిపించింది. విద్యావంతులైన శిష్ట వర్గాలు ధర్మశాస్త్ర గ్రంథాల్లో కూరుకుపోగా.. సామాన్య జనం భక్తి పారవశ్యంలో సేదదీరసాగినారు. ఆ విధంగా ప్రపంచంలోనే అత్యున్నతమైన

నాస్తిక/ నిరీశ్వరవాదాన్ని సృష్టించిన భారతీయ నాగరికత భక్తి/ శ్రద్ధ అనే ఇసుకపర్రల్లో ఇంకిపోయింది.

స్వాతంత్ర్యం తరువాత ఆధునిక, వైజ్ఞానిక దృక్పథం ఉన్న నాయకుల మార్గదర్శకత్వంలో మన సమాజం తిరిగి ఒక ఉన్నత బౌద్ధిక, సాంస్కృతిక ప్రయాణం ప్రారంభించింది. కానీ వేల యేళ్ళుగా భక్తి అనే ఊబిలో కూరుకుని ఉన్న ఈ సమాజం ఈ నవీనమైన మార్పులను అయిష్టంగానే స్వీకరించింది. కానీ ఆధునిక, శాస్త్రీయ దృష్టికి బౌద్ధం శత్రువులైన మతతత్వ శక్తులు ఇటీవల అధాకారంలోకి వచ్చి గత 75 ఏళ్ళుగా ఈ దేశంలో వస్తున్న మార్పులను పూర్తిగా రద్దు చేసి దేశాన్ని తిరిగి 10 శతాబ్ది మానసికతలోకి వెనక్కి నడిపించడం మనం చూస్తున్నాం. నిజానికి మెజారిటీ ప్రజలకు ఈ హిందూ మెజారిటేరియన్, ఈ హిందూ రాష్ట్ర అనే భావాలతో పెద్దగా పేచీ లేకపోవడం కూడా మనం చూస్తున్నాం. నిజానికి బీజేపి లాంటి పార్టీల విజయం ఆ పార్టీల నైపుణ్యం, వ్యూహ చతురత ఎంతమాత్రం కాదు. ఈ సమాజంలో ఎప్పటినుంచో పాతుకుపోయిన ఉన్న ఒక స్తబ్ద సంస్కృతి బీజేపిలాంటి పార్టీకి అత్యంత అనుకూలమైనది. ప్రగతిశీల, ఆధునిక , వైజ్ఞానిక దృష్టి ఉన్న పరివర్తనా శక్తులకు ఈ సమాజం నుండీ అంత సులభంగా మద్దతు దొరకదు.

ఈ వాస్తవాన్ని దృష్టిలో పెట్టుకుంటూనే... మనం పని చేయవలసి ఉంటుంది. ఉన్నతమైన ఆలోచనలు చేయగల, ఉన్నతశ్రేణి కళా సృజన చేయగల, ప్రజల ఆలోచనలోనే కాక అభిరుచులను మార్చగల, ప్రజల అవసరాలనే కాక ప్రజల విలువలను కూడా పట్టించుకోగల, మార్చగల ఒక మహా సాంస్కృతిక ఉద్యమం నేటి మన దేశం అవసరం. ఆ కర్తవ్యాన్ని పూర్తి చేయాలంటే మొట్టమొదలు శక్తివంతమైన బౌద్ధిక బృందాలను తయారు చేయడంపై మన శక్తి కేంద్రీకరించ వలసి వున్నది.

సుమారు రెండు వేల సంవత్సరాలపాటు, ఉన్నతమైన ఆలోచనలకూ, ఉన్నతమైన సాహిత్యానికీ, కళలకూ, స్వేచ్ఛా/ సమానత్వ విలువలకూ దూరమైపోయిన ఒక సమాజం ఎంతగా గిడసబారిపోగలుగుతుందో... దానికి మేలైన ఉదాహరణ భారత సమాజమే. నాస్తికవాదం లేదా నిరీశ్వర వాదం దేవుడి ఉనికిని నిరాకరించేందుకే పరిమితమయి పోయినట్లైతే... దాన్ని భావవాదం మార్మికవాదం, నిస్సారమైన ఆధ్యాత్మిక వాదం మింగివేయడానికి ఎంతోకాలం పట్టదని మన దేశం సాంస్కృతిక చరిత్ర ఋజువు చేసింది.

ఆధునిక విజ్ఞానశాస్త్రం వెలుగులో, ఆధునిక తత్వచింతన వేసిన దారుల్లో నడవడం నేర్చుకున్నప్పుడు మాత్రమే నాస్తికవాదం ఒక ప్రచండమైన సామాజిక పరివర్తనా శక్తిగా తన ప్రభావం చూపగలుగుతుంది. మహత్తరమైన ఈ ఆశయంతో దశాబ్దాలుగా ఎంతో నిబద్ధతతో పనిచేస్తున్న నాస్తిక సమాజం ఇలాంటి ఒక బౌద్ధిక సాంస్కృతిక ఉద్యమానికి నమూనా సృష్టించగలదనే ఆశాభావంతో సెలవు తీసుకుంటున్నాను.

*(33వ జాతీయ నాస్తికమేళాలో జి.భార్గవ ప్రసంగ పాఠం)*

# జీవపరిణామం, అసమానతలు

- డా॥ కొడవటిగంటి రోహిణీప్రసాద్

ప్రాణుల్లో జన్యువుల పాత్ర ఎటువంటిదో పరిశీలిస్తున్న ఆధునిక పరిశోధకులూ, వారి ప్రతిపాదనలూ తీవ్రమైన విమర్శలకు లోనవక తప్పడంలేదు. ఏ ప్రాణికైనా (అందులోనూ మనిషి జాతికి) ఎలాగో అలా తన మనుగడను కొనసాగించడం, సంతానోత్పత్తి సాధించడం అనేవే జీవిత లక్ష్యాలని అంగీకరించేందుకు చాలామందికి అభ్యంతరాలున్నాయి. మానవజాతి ఉన్నతమైనదనీ, ఎంతో సంస్కారం కలిగినదనీ మనకు సహజంగా ఉండే అహంకారభావాలను కాస్త పక్కన పెట్టి డార్విన్ పరిణామసిద్ధాంతాన్ని అవగాహన చేసుకుంటే మటుకు ఈ ప్రతిపాదన సబబుగానే అనిపిస్తుంది. శరీరనిర్మాణం తదితర అసంఖ్యాకమైన అంశాల దృష్ట్యా మనిషిజాతి కూడా ఇతర జీవాల్లా ఆవిర్భవించినదే. జీవరాశి అంతా భౌతిక ప్రేరణలకు లోనై భూమి మీది ఈ దశకు పరిణామం చెందినదనేది నిరాకరించలేని సత్యం. ఏకకణజీవుల నుంచి మనదాకా అన్ని ప్రాణులూ వందల కోట్ల సంవత్సరాల తరబడి అనేక రకాల గట్టిపోటీలని విజయవంతంగా ఎదుర్కొన్నందువల్లే ఇదంతా సాధ్యమైనదనేది కూడా తెలిసినదే. ఇందులో ముఖ్యమైన విషయం అసమానత. భౌతిక పరిస్థితులకు తట్టుకోగలిగిన సామర్థ్యం అన్ని రకాల శరీర లక్షణాలకూ, వాటికి దోహదపడే జన్యుసముదాయాలకూ సమానంగా ఉండదు. అందుకే ప్రకృతి పెట్టే పోటీలో కొన్నే గెలుస్తాయి. అసమానత ఉంటేనే వడపోత కార్యక్రమం జరుగుతుంది. సమానత ఏ మాత్రమూ లేకపోవడమే ప్రకృతిధర్మాల మూలసూత్రం.

స్వార్థజన్యువుల ప్రతిపాదనలో ఇదంతా బుద్ధిపూర్వకంగా జరగగలిగిన ప్రక్రియల క్రమం కాజాలదనీ, ప్రతీ ప్రాణి శరీరంలోనూ జన్యుస్థాయిలో నిలదొక్కుకునేందుకు నిత్యమూ జరుగుతున్న ప్రయత్నాల ఫలితమనీ ప్రయోగాలు ఋజువు చేస్తున్నాయి. దీనర్థం ఏమిటంటే జీవరాశి చరిత్ర యావత్తూ డిఎన్ఏ తదితర జన్యుపదార్థాలన్నీ తమను తాము పునఃసృష్టి చేసుకొనే కార్యక్రమం మాత్రమే, ప్రాణులన్నీ ఇందుకు తల ఒగ్గవలసిందే. ఇందులో వివేకమూ, వివేచనా మొదలైన వాటికి స్థానం ఉన్నట్టు కనబడదు.

ఈ ప్రతిపాదన విన్నవారికి దాదాపు లక్ష సంవత్సరాలుగా జంతువుల నుండి వేరుపడి సమాజజీవితం మొదలుపెట్టిన తమ నాగరికతా, సంప్రదాయాలూ, నీతులూ, రీతులూ, నియమ నిబంధనలూ అన్నీ నీరు కారిపోయినట్టుగా అనిపించడంలో ఆశ్చర్యంలేదు. అందులోనూ అనేక శతాబ్దాలుగా బైబిల్ మొదలైన మతగ్రంథాల్లో సృష్టి గురించీ, భగవంతుడి ఉద్దేశాల గురించి సూక్తులూ, ఉపదేశాలూ విని నమ్మినవారికి ఇది పచ్చి నాస్తికవాదంలాగా అనిపిస్తుంది. కొందరు భౌతికవాదులకు కూడా ఇదొక యాంత్రిక వాదంలాగా, మానవ సంస్కృతికే అవమానకరంగా అనిపించవచ్చు. అంతేకాక, ఈ లెక్కన చూస్తే మన జీవితాలకు ఆదర్శవంతమైన గమ్యం ఏదీ లేనట్టుగా తోస్తుంది.

జన్యువుల స్వార్థ లక్షణాలను గురించి ప్రతిపాదిస్తున్నవారు మనం వాటికి అన్ని విధాల లోబడి ఉండాలనిగాని, ఉంటున్నామనిగాని చెప్పడం లేదు. జీవపరిణామవాదానికి బలం

చేకూరుస్తూ, మనలోనూ, తక్కిన ప్రాణుల్లోనూ ప్రకృతిపరంగా జన్యువులు నిర్వహిస్తున్న పాత్ర ఎటువంటిదో వారు వివరిస్తున్నారు. జగన్నాటకంలో దేవుడికి ఎటువంటి పాత్రా లేదని వారు స్పష్టం చేస్తున్నారు. ఎటొచ్చీ మనుషుల జీవితాల్లో జీవపరిణామంకన్నా అతివేగమైన మార్పులు సామాజిక పరిణామాల ద్వారా కలుగుతున్నాయి. అందుకనే జన్యువులతో తిన్నగా సంబంధం లేనటువంటి అనేక అంశాలు మనుషుల జీవితాల్లో ప్రత్యేకంగా కనిపిస్తాయి. మన సమాజజీవితమూ, సాటివారితో సంబంధాలూ, కళలూ, సాహిత్యమూ, సంస్కృతీ ఇవేవీ శారీరక లక్షణాలకు దారితీసే జన్యువుల వల్ల కలిగినవి కావు. ఈ రకమైన పరిణామాలు అతి సూక్ష్మస్థాయిలో ఒక్క మనిషిజాతిలో మాత్రమే ఎటువంటి జన్యు పరివర్తనలు కలిగిస్తున్నాయో శాస్త్రవేత్తలు అత్యాధునిక పరిశోధనల ద్వారా తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. వీటి సంగతి ప్రస్తుతానికి పక్కన పెడితే ప్రాణులన్నిటికీ అవసరమయే భోజన, నిద్రా, మైథునాదులన్నీ మటుకు జన్యువులు శాసించినట్టే అమలు జరుగుతున్నాయనేది నిజం. ఎటొచ్చి మనం వాటి 'మాట' వినవలసిన అవసరం లేదు. అలా జరగటం లేదు కూడా.

ఒకప్పుడు మనుషుల ప్రవర్తనకు కారణాలను మనోవిశ్లేషణ ద్వారా తెలుసుకునే ప్రయత్నాలు జరిగాయి. తరవాతికాలంలో మెదడులోనూ, తక్కిన శరీరంలోనూ ఏయే ఉద్రేకాలు ఎటువంటి జీవ రసాయనిక మార్పులను కలిగిస్తాయో, ఎటువంటి హార్మోన్లను విడుదల చేస్తాయో అర్థం కాసాగింది. ప్రస్తుతం జన్యుపరంగా జన్మతః కొందరికి కొన్ని రకాల స్వభావాలు ఉండ వచ్చునేమోనన్న పరిశోధనలు జరుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో జన్యువులు ప్రాణుల్లో సృష్టించే సహజాతం (ఇన్‌స్టింక్ట్) మనుషుల్లో ప్రత్యేక పరిణామాలను కలిగిస్తుంది. ఉదాహరణకు అగ్రెషన్ అనే స్వభావాన్నే తీసుకోవచ్చు. సందర్భాన్ని బట్టి దీన్ని దురాక్రమణగానో, దుందుడుకుతనంగానో, హింసాత్మక ప్రవృత్తిగానో పరిగణిస్తాం. క్రీడల్లోనో, వ్యాపారంలోనో దీనివల్ల విజయాలు సాధించిన వారిని మనం మెచ్చుకుంటాం. అలాగే తన పిల్లలనో, మానాన్నో కాపాడుకోవటానికి తిరగబడ్డ స్త్రీలను ప్రశంసిస్తాం. కానీ యుద్ధాల్లోనూ, మతకలహాల్లోనూ క్రూరంగా ప్రవర్తించినవారిని దుయ్యబడతాం. కొంతమంది నేరస్థుల్లో  ఇదొక మానసిక రుగ్మత స్థాయికి పెరుగుతుంది.

కొన్ని జంతువులు ఆహారం కోసం ఇతర జంతువులను వేటాడుతున్నప్పుడు రక్తపాతం జరిగి దురాక్రమణ చేస్తున్నట్టుగా అనిపిస్తుంది. కాని ఆ చర్యల వెనక ద్వేషాలు, కక్షలూ ఉండవు. ఒక జింక కోసం ఒక పులి ఇతర పులులతో పోటీ పడుతుంది. కాని అది మనుగడకై జరిగిన జన్యుపరమైన పోటీ. ప్రకృతిలో విరివిగా లభ్యం కానివాటి కోసమే పోటీ జరుగుతుంది. పీల్చే గాలి వంటి దాని కోసం పోటీ అవసరమవదు. ప్రాణుల్లో సామాన్యంగా టెస్టోస్టెరాన్ అనే మగ హార్మోన్ అగ్రెషన్ విషయంలో పనిచేస్తుంది. ఇది ఎక్కువైతే దురాక్రమణ స్వల్పకారణాల వల్ల కూడా జరిగే అవకాశం పెరుగుతుంది. మనుషుల విషయానికి వస్తే మగవారిలో హింసాత్మక ప్రవృత్తి నిశ్చయంగా ఎక్కువే. జంతువులలాగా కాకుండా మనుషులకు పగలూ, కక్షలూ, కావేషాలూ ఉంటాయి. ఏనాడో జరిగిన అవమానాలూ, అన్యాయాలూ, స్వలాభానికై తలపెట్టే దుశ్చర్యలూ మనుషులను హింసాత్మక దాడులకు దారితీస్తూ ఉంటాయి. అలాగే మన తక్కిన కోరికలూ, వాంఛలూ అన్నిటిలోనూ మన మెదడులో రకరకాల ప్రక్రియలు జరుగుతాయి.

అన్ని రకాల ఆవేశాలనూ అదుపు చేసుకుని స్థితప్రజ్ఞులలాగా జీవించడం అందరికీ, అన్ని వేళలా సాధ్యం కాకపోయినా మన ప్రవర్తనకు కారణమైన మానసిక ప్రేరణలనూ, వాటి వెనక పనిచేస్తున్న జీవరసాయనిక ప్రక్రియలనూ కొంతవరకైనా అర్థం చేసుకోవడం అవసరం.

ఈ సంగతులు ఎందుకు చెప్పుకోవాలంటే సమాజ శ్రేయస్సుకై మనుషులందరూ సమష్టిగా కృషి చెయ్యవలసిన అవసరం నానాటికీ పెరుగుతోంది. పరుల హితాన్ని కోరుతూ నిస్వార్థవైఖరిని ప్రదర్శించే ప్రయత్నాలకు ప్రకృతి ఏ మాత్రమూ సహకరించదనేది గుర్తుంచుకోవాలి. అసమానతలపై ఆధారపడి పోటీతత్వమే పరమావధిగా జరుగుతూ వస్తున్న జీవపరిణామం పరహితవైఖరి అసహజమైనదని నిరూపిస్తుంది. గాయపడ్డ జంతువుకు సాటి ప్రాణులు వైద్య సహాయం అందించలేవు సరికదా కాపాడే ప్రయత్నం కూడా చెయ్యవు. ఇలాంటి విషయాల్లో మనుషుల ప్రవర్తన మొదటి నుంచీ వేరుగా ఉండేది. తమ మనుగడకు పరస్పర సహకారం చాలా అవసరమని వారు ఏనాడో గుర్తించారు. జన్యువుల సహజవైఖరికి అడ్డుకట్ట పడడం మొదలై చాలాకాలమైంది. ముఠాలుగా, తెగలుగా, గుహల్లో తలదాచుకుంటూ జీవించిన ఆదిమానవులు కలసికట్టుగా ఉండడం అలవరుచుకున్నారు. స్వంత ఆస్తి అనేదేదీ లేని ఆ యుగంలో, దొంగతనం, నేరాలూ ఎరగని తొలి సమాజంలో చావు తప్పించుకోవడమే జీవిత లక్ష్యంగా ఉండేది. సమాజం పెరిగి, అందులో వర్గాలూ, విభేదాలూ ఏర్పడడం మొదలయాక మనుషుల్లో అంతర్లీనంగా ఉన్న పశుప్రవృత్తి మళ్ళీ తలెత్తసాగింది. మనుషులందరూ సమానం కాదని నిరూపించేవారు సమాజంలోని అసమానతలకు దాన్ని సాకుగా చూపుతారు. మనుషులందరూ సమానం కాదని జన్యుస్థాయిలో కూడా తేలుతోంది. నిజానికి ఆ విషయం సమాజంలోని అసమానతలను రూపుమాపడానికి మనని ప్రేరేపించాలి. బలహీనులను గాలికి వదిలెయ్యకుండా కాపాడుకొని, జంతువులకూ, మనకూ భేదం ఉందనేది నిరూపించాలి. అలాగే ఉద్రేకాలూ, ఆవేశాలూ మనకు సహజమే. వాటిని వ్యక్తిగత కక్షలు తీర్చుకోవటానికి కాకుండా సమసమాజాన్ని నిరోధించేవారి పట్ల ప్రదర్శించాలి. ఒక్కొక్క మనిషిలోనూ ఉండే వివిధ రకాల సామర్థ్యాలని అందరికీ ఉపయోగపడే విధంగా వాడుకోగలిగితే జన్యువుల స్వార్థధోరణిని మనం తిప్పికొట్టగలం.

---

## 33వ నాస్తికమేళా దృశ్యములు



ముళ్ళవేందన్ ఎస్.హనుమంతరెడ్డి కె.కృష్ణ పోలప్ప ఉమామహేష్

# వేదములు - ఒక విమర్శనాత్మక పరిశీలన

ఇంగ్లీషుమూలం: ప్రొ॥ : **సురేంద్ర అజ్ఞాత** అనువాదం : **కొత్తపల్లి రవిబాబు**

*(1977 జనవరిలో నిడమర్రు చార్వాకాశ్రమంలో జరిగిన ప్రథమ అఖిల భారత నాస్తిక మహాసభలలో చదివిన ప్రసంగ పాఠం.)*

(గత సంచిక తరువాయి)

**వేదాలు బూతుల పంచాంగాలు :-**

అదే పనిగా అశ్లీలమైన పదజాలం వాడినటువంటి శ్లోకాలు కోకొల్లలుగా వుండటంచేత, ఈ వేదాలను అశ్లీల గ్రంథాలుగా పేర్కొనవలసివస్తోంది. డా॥ అంబేద్కర్ వేదాలలో అవివేకపు రాతలు (tomfoolery) తప్ప ఏమీలేదు అని చెప్పినపుడు ఈ అశ్లీలపు రాతలను దృష్టిలో వుంచుకునే అన్నాడు.

కుటుంబ సభ్యుల ముందు ఆ శ్లోకాలకు అర్థం తెలిస్తే వాటిని చదవడం పరమ అసహ్యంగా వుంటుంది. మర్యాదస్తులైన వారు వినకూడని విషయాలు ఆ శ్లోకాలలో వున్నాయి. ఇక వాటిని బహిరంగ సమావేశాలలో చదవడం అంటే – ఇక మాట్లాడనక్కరలేదు. ఏ సమాజమైతే లైంగిక ప్రవృత్తిని నీచంగా పరిగణించిందో ఆ సమాజమే దీనిని, ఈ శ్లోకాలను దైవ ప్రవచనంగా స్వీకరించి గౌరవించడం చాలా ఆశ్చర్యకరమైన విషయం. బహుశా ఈ అశ్లీలమైన శ్లోకాలమూలం గానే కాబోలు, బ్రాహ్మణ పురోహితులు వేదాలను అధ్యయనం చేసే హక్కును తమవరకే పరిమితం చేసుకున్నారు. అప్పట్లోవారు అరణ్యాలలోనూ, అక్కడక్కడా పర్వతాలలోనూ నివసించేవారు.

ప్రపంచ గ్రంథాలయంలోని అత్యంత ప్రాచీన గ్రంథాలైన ఈ వేదాలలోని కొన్ని శ్లోకాలను బయటపెట్టి, ఈ వేదాల బండారం బయటపెడతాను. ఉదాహరణకు ఈ శ్లోకాలు చూడండి.

అ) ఉషోదేవతను స్తోత్రకారుడు ఇలా స్తోత్రం చేస్తున్నాడు. "బహిష్టు పూర్తయిన తర్వాత ఉషోదేవత మన్మథుని చేత చిత్రహింసలకు గురై తన భర్త వద్దకు వెళ్తుంది."

ఆ) జ్ఞానదేవతను పొగుడుతూ ఇలా వుంది. "ఓ జ్ఞాన దేవత నిన్ను చూడలేనివారు కొందరు వున్నారు. కానీ మరికొంతమందికి మాత్రం నీవు, బహిష్టు తర్వాత స్త్రీ ఏ విధంగా తన వస్త్రాలు విప్పి భర్త ముందు నిలుస్తుందో – అలా దర్శనమిస్తుంటావు.[39]

ఇ) పుష్టా అనే దేవుణ్ణి పొగుడుతూ : "నా అమ్మ మొగుణ్ణి స్తుతిస్తున్నాను. అతని సహోదరి యొక్క రంకుప్రియుడెవరో అతన్ని విననీయండి."[40]

అత్యంత అభ్యంతరకరమైన శ్లోకాలు వున్నాయి. అవి ఉదహరించడానికే నేను సంకోచిస్తున్నాను. కానీ వేదాలలో ఏముందో చూపించాలంటే వాటిలో కొన్నైనా ఉదాహరించక తప్పదు.

యజుర్వేదం : 21/60 స్వామి దయానంద వ్యాఖ్య; అధర్వవేదం : 4/4/6; అధర్వవేదం: 4/4/8, అధర్వవేదం : 6/101/3, యజుర్వేదం : 14/60; అధర్వవేదం : (4-4-1); అధర్వవేదం : 2/30/5; అధర్వవేదం : 20/133/164, అధర్వవేదం : 14/2/38, అధర్వవేదం : 14/2/39; అధర్వవేదం : 9/10/12; అధర్వవేదం : 10/10/11; యజుర్వేదం : 23/22, 23/123 మహీధర వ్యాఖ్యలలో వున్న శ్లోకాలలో అశ్లీల అర్థాలను పరిశీలించుకోవచ్చు.

**యజ్ఞయాగాదులు :-**

నేయి పోయడం నుంచి మనుషులను హోమగుండంలోకి త్రోయడం వరకు వుండే అన్ని రకాల క్రతువులను మనం వేదాలలో చూడగలం. వీటిలో మూడు రకాల క్రతువులు - అశ్వమేధ, గోమేధ, నరమేధ యాగాలు చూద్దాం.

అశ్వమేధయాగంలో పరిశుభ్రపరచబడిన అశ్వం, వీరుల చేత రక్షింపబడుతూ దేశంపైకి వదలబడుతుంది. దానితోపాటు మరో 100 గుర్రాలు వుంటాయి. ఆ గుర్రాన్ని ఇతర రాజులకు ఛాలెంజ్‌గా, స్వేచ్ఛగా వదలివేస్తారు. ఒక సంవత్సరం తర్వాత రాజు, రాణితోబాటు (తన సేవకులు, అధికారులు వెంటరాగా) రోజూ కొన్ని క్రతువులు నిర్వహిస్తారు. వీటిలో రోజూ ఆ రాజు యొక్క పూర్వీకుల గురించిన గాథలు వినిపిస్తుంటారు. రాజును పరిశుభ్రంగా వుంచుతారు. గుర్రానికి బాగా నూనె రాసి శుభ్రపరుస్తుంది రాణి. రకరకాల ఆచారాలు పాటించిన తర్వాత, ఆఖరకు ఆ గుర్రాన్ని చంపి, దాని మాంసాన్ని వేయించుతారు.

గుర్రానికి నూనె రాసేటప్పుడు, ఆ గృహస్తుని భార్య గుర్రంతో ఇలా అంటుంది.

"ఓ అశ్వమా! నా సమీపానికి రా! నీ వీర్యాన్ని నాలో పోసుకుంటాను. నీ వీర్యంతో నేను గర్భందాల్చాలనుకుంటున్నాను" ఇలా చెప్తూ ఆవిడ ఆ గుర్రపు లింగాన్ని చేతితో పట్టుకొని తన యోనిలో దోపుకుంటుంది. ఆ గుర్రం తన లింగాన్ని ఆవిడకి యోనిలోపలికి బాగా లోతుగా దూర్చాలన్న ప్రార్థనలతో ఇతరులు ఆ గుర్రాన్ని ఆరాధించేవారు.[56]

గోమేధంలో గోవును బలి ఇచ్చేవారు. దాని మాంసాన్ని మరణించిన తాతముత్తాతలకు అర్పించేవారు.[57] పురుషమేధం ఇంకా భయంకరమైనది. దీనిలో మనిషినే బలి ఇస్తారు. అశ్వమేధానికి సంబంధించిన కర్మకాండ అంతా దీనిలోనూ వుంటుంది. ఈ బలిపశువుగా వున్నవాడిని ఒక సంవత్సరంపాటు ఇష్టం వచ్చినట్లు తిరుగుతూ, మేయడానికి అనుమతి ఇస్తారు. ఈ కాలంలో అతనికి గల కోరికలన్నీ తీర్చబడతాయి. అశ్వమేధంలో రాణి ఏవిధంగా గుర్రంతో ప్రవర్తిస్తుందో, అదే విధంగా ఇతనితోనూ ప్రవర్తిస్తుంది.[58]

**బ్రాహ్మణ తత్త్వం :-**

వేదాలు బ్రాహ్మణ కవుల చేత సృష్టింపబడటంచేత వీటిలో నీచమైన భావాలన్నీ వున్నాయి. బ్రాహ్మణులకు అనవసరమైన సౌకర్యాలు, హక్కులు ఇవ్వబడ్డాయి. దీనినే బ్రాహ్మణతత్వం అనవచ్చు. బ్రాహ్మణులనెవరైనా అవమానపరచినా, వారి నుంచి పైకం తీసుకున్నా, అతడు తన రక్త ప్రవాహంలోని వెంట్రుకలను తింటూ జీవించేటట్లు చేయాలని వుంది.[59] ఏ రాజైనా పొగరుబోతుదనం వల్ల కానీ, ఆగ్రహం వల్ల కానీ, బ్రాహ్మణుడిని చంపాలనిగాని, ఓడించాలనిగానీ తలచినట్లయితే అతని రాజ్యం నాశనమైపోతుంది.[60]

'ఓ నారదా! బ్రాహ్మణుడికి సంబంధించిన విలువైన వస్తువులనుగాక, సంపదనుగానీ ఎవరైనా కాజేయాలనుకుంటే, వారిపట్ల చెట్లు కూడా కినుక వహించి, వారితో 'మా నీడ నుంచిపో' అని చెట్లుకూడా అంటాయి.[61]

ఆర్యుల వర్ణ వ్యవస్థలో రెండవస్థాయికి చెందిన క్షత్రియులు, బ్రాహ్మణులు సేవలు

వినియోగించు కోవాలనుకుంటే వారు తమ తేజస్సును పోగొట్టుకోవడం క్రిందే లెక్క, అంటే తన కుటుంబానికి విషపూరిత పానీయం ఇచ్చినట్లే.[62]

బ్రాహ్మణుడు తన శత్రువును ధ్యానం ద్వారా లేక ఆగ్రహం ద్వారా నాశనం చేయగలడు. బ్రాహ్మణుడు ఎవరినైనా శపిస్తే, అతన్ని ఎవరూ రక్షించలేరు.[63]

బ్రాహ్మణ స్త్రీకి వస్త్రదానాలు చేసిన వ్యక్తి ఇంటికి అంటిపెట్టుకున్న దయ్యాలన్నీ పారిపోతాయి.[64] ఏదైనా గోవు ఒక బ్రాహ్మణుడి ఇంటికి వెళ్ళాలని కోరితే, ఆ కోరికను దేవుళ్ళు తప్పక గమనిస్తారు. తర్వాత ఆ విషయాన్ని వీరు బ్రాహ్మణులకు తెలియచేస్తారు. అపుడా బ్రాహ్మణుడు, యజమాని (ఎవరైతే బలి లేక పుణ్యకార్యం చేస్తాడో) వద్దకు ఆవును దానం అడగటానికి వెళ్తాడు. ఆవును బ్రాహ్మణునికి దానం చేయడం ద్వారా ఆ గృహస్తుని సర్వాభీష్టాలూ తీరుతాయి.[66]

మూలికలన్నీ సోమదేవుని ముందు ప్రతిజ్ఞ తీసుకున్నాయి. బ్రాహ్మణ వైద్యుడు ఇస్తేనే తాము రోగుల వ్యాధులను నయం చేస్తామని ప్రతిజ్ఞ సారాంశం.[67]

సమాజంలోని ఉన్నత వర్గాల ప్రయోజనాలను ఏదో ఒక విధంగా రక్షిస్తున్నట్లు చూపే ఇటువంటి శ్లోకాలు వేదాలలో అసంఖ్యాకంగా వున్నాయి. ఇవే గనుక దేవుని సృష్టి అయితే, ఇంత అసమానమైన స్థాయిని మానవునికి దేవుడు ఇచ్చి వుండాల్సిందికాదు. ఈ శ్లోకాలకు కర్తలంతా ప్రధానంగా బ్రాహ్మణ కులానికి చెందినవారేనని ఈ శ్లోకాలలో కనబడే బ్రాహ్మణ తత్త్వమే చెబుతోంది. తమ కులం యొక్క ప్రయోజనాలను కాపాడుకోడానికి వారు తమ శాయశక్తులా కృషి చేశారు.

**మూఢనమ్మకాలు :-**

హిందూ మతానికి ఆధికారికమైన గ్రంథాలనుకుంటున్న ఈ వేదాలే మతం పేరుతో జరిగే అన్ని కర్మకాండలకు మూలం. హిందూధర్మంలో, అపశకునాలు, దుష్టనక్షత్రాలు, కలలకు సంబంధించిన అసంఖ్యాకమైన మూఢనమ్మకాలున్నాయి. అధర్వవేదం నుంచి ఒక పొడుగైన జాబితా తయారుచేయవచ్చు. వాటిలో కొన్నిటిని ఉదహరిస్తాను.

ఒక అతిథి, ఒక రోజు గనుక గడిపితే, ఆ గృహస్థుకు లోకంలో అన్ని సత్కార్యాలు చేసిన ఫలితం పొందుతాడు. అదే రెండురోజులు ఆతిథ్యం ఇస్తే, స్వర్గ లోకంలో సత్కార్యాలు చేసిన ఫలితం అనుభవిస్తాడు.[68]

స్వర్గంలో పురుషులకు ఎముకలు లేవు. అస్థులు, స్వచ్ఛంగా, మలినరహితంగా వుంటుంది. స్వర్గంలో నివసించేవారికి కామవాంఛలు ఇబ్బంది పెట్టవు. స్వర్గవాసులకు స్త్రీలు ఎక్కువెక్కువగా వున్నారు.[69.]

వేదాలలో యక్షులు[70], కిన్నెరులు, గాంధర్వులు, అశ్వనీదేవతలు, పరలోకం, రాక్షసులు, దయ్యాలు, ఇంద్రజాలం[75] తాయెత్తులు[76] దుష్టగ్రహాలకు సంబంధించిన అపశకునాలు[77] పక్షులు[78,] కలలవల్ల వచ్చే చెడు ప్రభావాలు[79] ఇవన్నీ ఉన్నాయి.

**మాంస భక్షణ - మదిరాపానం :-**

గొర్రెమాంసం, గొడ్డుమాంసం, ఆవు, గుర్రం, పొటేలు మాంసం తినే అలవాటు వేద రయితలకు వున్నట్లు - వేదంలో అసంఖ్యాకములైన ఉదాహరణలు వున్నాయి. ఇంకా కొందరు నరమాంస భక్షకులు కూడా వున్నట్లు వుంది. వీటిని మనం అధర్వ వేదంలో చూడగలం.[80]

వేదాలు, మదిరాపానాన్ని కూడా పొగుడుతాడు. ఉర్దూ కవితలో మదిర గురించి స్తోత్రాలు వున్నట్లే, మత్తు పానీయాల గురించి వేదాలలో కూడా ఇదే విధంగా వుంది.

సోమరసం, సుర తరచు వేదాలలో కనబడే పానీయాలు, వేదపండితులకు సోమరసం పట్లగల ఆప్యాయత అసాధారణమైనది. ఋగ్వేదంలోని 1/10వ భాగం సోమపానం గురించి, సోమరసం గురించి, దానికి గల మత్తు గురించిన చర్చలు ఆక్రమించాయి.

వేదాలనారాధించేవారు. వేదాలలో మాంసాహారం, మత్తుపానీయాల పానం నిషేధించారని చెప్పడం వింటే మన కాశ్చర్యం వేస్తుంది. హిందువులందరూ అలాగే చెప్తారు. పవిత్ర గ్రంథాలుగా తలస్తున్న పుస్తకాలపట్ల వారికిగల అజ్ఞానాన్నే ఇది తెలియచేస్తుంది.

**కులతత్త్వం :–**

హిందూ మతమంతా వేదాలపై ఆధారపడివుంది. హిందూ మతాన్ని పతనావస్థకు తెచ్చిన కుల విభజన సిద్ధాంతాన్ని వేదాలే ప్రవచించాయి. "బ్రాహ్మణులు దేవుని ముఖం నుంచీ, క్షత్రియులు భుజాలనుంచీ, వైశ్యులు తొడల నుంచీ, శూద్రులు పాదాల నుంచి పుట్టారని వేదాలు చెప్తున్నాయి.[81]

ఈ అసమానతలు తెచ్చిపెట్టే సిద్ధాంతం ప్రపంచం మొత్తం మీదే విలక్షణమైనట్టిది. ప్రపంచమంతా దేవుని సృష్టి అయినపుడు, కులాలు భారతదేశంలోనే ఎందుకు సృష్టింపబడ్డాయి ఆ దేవుని చేత? అంటే – ఇది ఆ వేదాలు రాసినవారికి గల పరిమితమైన భౌగోళిక జ్ఞానం మాత్రం సూచిస్తోంది. అప్పట్లో వాళ్ళకు వాళ్ళు నివసిస్తున్న కుగ్రామాలు తప్ప మరో ప్రపంచం తెలియదు. వాళ్ళ కుగ్రామాలే వారి ప్రపంచం. వాళ్ళ గ్రామాల్లో వాళ్ళు ఏమేమి చూస్తున్నారో. అదే ప్రపంచమంతా వున్నట్లు భావించారు.

అసలు పరిస్థితి ఇలా వుండగా – వేదాభిమానులు ఈ వేదాలను సర్వజ్ఞాని అయిన దేవుడు సృష్టించాడనటంలో ఆశ్చర్యమేమీ లేదు.

**నమ్మరాని విషయాలు – అసంబద్ధ ప్రేలాపనలు :–**

వేదాలలో అసంబద్ధ ప్రేలాపనలు కోకొల్లలుగా వున్నాయి. వాటిలో కొన్నిటిని ఉదహరిస్తాను.

వేదాలలో ఒకచోట మగ మేకపాల గురించి ప్రస్తావన వుంది.[82] మరోచోట, ఆ వేదాలు ప్రతీ యువతిని పదిమంది పుత్రులకంటే ఎక్కువ మందిని కనవద్దని ఉపదేశించాయి.[83] ఆ వేదాలే మరోచోట వ్యవసాయదారులకు సలహా ఇస్తూ పొలాన్నంతా...

యజుర్వేదమంతా అర్థంపర్థం లేని రాతలున్నాయి. ఉదాహరణకు కొన్ని. 'మలద్వారం గుండా గ్రుడ్డి పాములను నీకు అర్పిస్తున్నాను; 'జలదేవతను మూత్రం ద్వారా శాంతింపచేస్తాను"; "బృవేణ దేవునికి నా వృషణాలు అర్పిస్తున్నాను." వజ అనే దేవుణ్ణి నా లింగం ద్వారా సంతృప్తి పరుస్తాను, 'వీర్యంచేత ప్రజలను సంతోషపరుస్తాను.' "కుమ్మణ దేవుణ్ణి బయటకు వచ్చే ద్రవాల చేత సంతృప్తిపరుస్తాను"; [85]

ఉదాహరణ చూడండి – ఈ అర్థంపర్థం లేని వాక్యం చూడండి. 'దేవుడు భూమికి పుట్టినాడు. భూమి దేవుడికి పుట్టింది. ఆ దేవుడు జలానికి పుట్టాడు. జలం దేవుడి నుంచి పుట్టింది. ఆ దేవుడు అగ్ని నుండి పుట్టాడు. అగ్ని దేవుడినుంచి పుట్టాడు. దేవుడు వాయువు నుంచి పుట్టాడు. వాయువు దేవుడి నుంచి పుట్టాడు.[86]

*(ఇంకావుంది)*

## ఆలోచనల బాట - అంజన్నమాట

### ప్రశ్నించు – ఎదిరించు

ఎదిరించేవాడు లేకపోతే
బెదిరించే వాడిదే రాజ్యం
ప్రశ్నించే వాడు లేకపోతే
ప్రజాస్వామ్యం ప్రశ్నార్థకం ॥ ఎదిరించే ॥

తిరగబడేవాడు లేకపోతే
తరతరాల బానిసత్వం వర్థిల్లుతుంది
పోరాడేవాడు లేకపోతే
మానవ హక్కులు హరించబడతాయి ॥ ఎదిరించే ॥

న్యాయంకోసం గళమెత్తక పోతే
అన్యాయం రాజ్యం మేలుతుంది
ప్రకృతిని కాపాడకపోతే
ప్రళయాలను సృష్టిస్తుంది ॥ ఎదిరించే ॥

బ్రూనో త్యాగం ఫలించకపోతే
భూమి నేటికీ బల్లపరుపుగా ఉండేది
గెలిలియో టెలిస్కోపు కనిపెట్టకుంటే
నిజం నిర్ధారణ కాకపోయేది కదా? ॥ ఎదిరించే ॥

న్యూటన్ తన సిద్ధాంతం కనిపెట్టకపోతే
గురుత్వాకర్షణ మరుగున పడేది
డార్విన్ పరిణామ సిద్ధాంతం కనిపెట్టకుంటే
జీవపరిణామం తెలియకుండా పోయేది ॥ ఎదిరించే ॥

త్యాగధనుల వల్ల స్వేచ్ఛ లభించింది
శాస్త్రీయ దృక్పథం వల్ల విజ్ఞానం లభించింది
మార్గదర్శకుల వల్ల మానవ అభివృద్ధి జరిగింది
మహనీయుల అనుభవాలే మనకు రక్ష ॥ ఎదిరించే ॥

మూఢనమ్మకాలు భయాన్ని కలిగిస్తాయి. విజ్ఞానాన్ని హరిస్తాయి. ప్రగతికి అవరోధంగా తయారౌతాయి.

పద్యం : తుమ్మినా దగ్గినా అపశకునమంటావు
విధవ స్త్రీ ఎదురయితే మంచికాదంటావు
భర్త మరణ మొంద భార్యేమి చేయురా
ఓదార్చె గుణ మొదలి భాదించనేలరా

తుమ్మేవానిదె జబ్బు భయము నీకేలరా
శకునాలు అనునవి ఛాదస్తమేనురా
మూఢనమ్మకాల ముసుగు తొలిగించుకో
ఆలోచనల బాట అంజన్నమాట

విగ్రహాలు పాలు త్రాగుతున్నాయంటారు. మరి పండ్లు తినవెందుకు? ఇంగితం కోల్పోతే మెదడు ఆలోచన కోల్పోతుంది.

పద్యం :- విగ్రహాలు పాలు త్రాగుతున్నాయంటే
వేలం వెర్రిగ పాలు పారబోస్తుంటారు
మురికివాడల్లోన పసిబిడ్డలెందరో
పాలునోచక ప్రాణమొదులుతున్నారురా
పాలుత్రాగిన విగ్రహం పండ్లు తినదెందుకనే
ప్రశ్నలోనే ఉంది అసలు నిజము
నిజము తెలియాలంటే ప్రశ్నించవలెనురా
ఆలోచనల బాట అంజన్నమాట

చదువువల్ల విజ్ఞానం రాకపోగా కరిమ్రింగిన వెలగపండయినది

పద్యం :- రాముడు దేవుడని రాగాలు తీయకు
రాముడొక రాజని రాసెరా వాల్మీకి
ముక్కు చెవులు కోయ తప్పనని లోకము
ఆలినమ్మిన వాడిని ఆదర్శమన్నారు
భార్యననుమానించి బహురచ్చ చేసినా
రామాయణమే లోక కళ్యాణమనిరి
విద్య ఏమయిపోయె విజ్ఞాన మెటుబోయె
ఆలోచనల బాట అంజన్నమాట

స్త్రీల పట్ల పురుష అహంకారం బుసలు కొడుతూనే ఉంది. సేవలు చేసే యంత్రంలా భావిస్తు - ఆడపిల్ల అంటే ఈ నాటికీ వివక్షే

ఆడపిల్లలు పుట్ట ఏడ్చెమూర్ఖుల్లార
మగవాళ్ళకు నువు జన్మిస్తివా చెప్పు
నిను కన్నదాడదే నీ భార్య ఆడదే
నీకు ఆడది పుట్ట శోకమెందుకు వొచ్చె
కొడుకు కావాలనే కోర్కె తన్నులకేర
వృద్ధాశ్రమాలను నింపేది వాళ్ళెరా
ఆడది లేకుంటే బూడిదే ఈ జగతి
ఆలోచనలబాట అంజన్నమాట

- కన్నెబోయిన అంజయ్య

# మతాన్ని చరిత్ర అంగీకరించదు

**కొప్పర్తి వెంకటరమణమూర్తి,** చరిత్ర అధ్యాపకులు

**మ**తం చరిత్రగా, చరిత్ర మతంగా మారిపోతున్న సమయంలో చరిత్రకు మతానికి ఉన్న సంబంధం ఏమిటనేది ప్రశ్నించుకుని సమాధానం రాబట్టుకోవలసి ఉంది. అందరికీ తెలిసిన విషయాలు కొన్ని చూస్తే మతం - వస్తువు దేవుడు. చరిత్ర ఇతివృత్తం– మనిషి. మతం తనను అనాది అంటుంది. చరిత్రకు గతం పునాది. మతం విశ్వాసం మీద నిర్మింపబడుతుంది. చరిత్ర నిజం మీద నిలబడుతుంది. మతానికి చరిత్ర ఉంటుంది కానీ చరిత్రకు మతం ఉండదు.

మతం హఠాత్తుగా మొదలౌతుంది. దేవుడు అనంతమైన విశ్వాన్ని, చరాచర జీవకోటిని సృష్టించాడని అంటుంది. ఆ శక్తి సకల చేతనాచేతనాల లోకి విస్తరించి ఉంటుందని విశ్వసిస్తుంది. శ్రీరాముడిగా శ్రీకృష్ణుడిగా అవతారాలెత్తాడని స్థిరీకరిస్తుంది.

అయితే చరిత్ర ప్రతి అంశంలో ఒక పరిణామాన్ని చూసినట్లే మతంలోనూ చూస్తుంది. చరిత్ర ఆస్తికురాలూ కాదు, నాస్తికురాలూ కాదు. పరమ అజ్ఞేయవాది. అది భగవంతుని అస్తిత్వం గురించి విచికిత్స చేయదు. దేవుడు మతాన్ని సృష్టించడం గురించి మాట్లాడదు కానీ మతం దేవుణ్ని సృష్టించుకోవడం గురించి వివరిస్తుంది. తనను పోలిన మనిషిని దేవుడు సృష్టించడం తెలియదు కానీ, తనను పోలిన దేవుణ్ణి మనిషి సృష్టించుకున్నాడంటుంది. స్థూలంగా దేవుడు చేసిన మనుషుల గురించి మతం మాట్లాడితే, మనుషులు చేసిన దేవుడి గురించి చరిత్ర మాట్లాడుతుంది. మనిషి ప్రారంభ దశలో పశుప్రాయుడనీ పశువు మాదిరిగానే దిగంబరుడనీ, లైంగిక విచక్షణ లేనివాడనీ, ఆహార సేకరణే గానీ ఆహార ఉత్పత్తి తెలియదనీ ఆధారాలతో సహా రుజువు చేస్తుంది చరిత్ర.

మతం– భగవంతుడు మనిషిని అనాగరికంగా సృష్టిస్తే అతడు రాతి, రాగి, కంచు యుగాల్ని అధిగమించి ఇనుప యుగంలోకి ప్రవేశించాడని గానీ, ఆహార సేకరణ, పశుపాలక సమాజాల్ని దాటుకుని వ్యావసాయిక సమాజంలోకి చేరుకున్నాడని గానీ చెప్పదు. మతానికి ఈ పరిణామాలతో సంబంధం లేదు. అది దేశ వ్యాపితంగా లభ్యమౌతున్న పనిముట్లు, ఆయుధాల వంటి వేలాది ఆధారాలను నిర్దాక్షిణ్యంగా పక్కకు తోసివేస్తుంది. కానీ చరిత్ర ఆ అపురూప సంపదల్ని పదిలపరచి వాటి ఆధారంగా మానవ పురాతన గతాన్ని పునర్నిర్మిస్తుంది.

వేదవాఙ్మయం అంతా దేవసృష్టి అంటుంది మతం. అయితే చరిత్ర... దేవతలకు–పూర్వ మానవులు అనే అర్థం చెప్పడంతో ముడి విడిపోయింది. ఋగ్వేదం అంతా తొలినాటి ఆర్యగణాల్లో సృజనాత్మకత, పారలౌకిక దృష్టి ఉన్న రసహృదయులు కొందరు ప్రాకృతిక అంశాలను ఆవాహన చేస్తూ ఆశువుగా చేసిన రచనల సమాహారమే తప్ప, ఆదిభౌతిక శక్తులు సృష్టించినది కాదని చెప్పింది.

యజుర్వేదంలో యజ్ఞాది కర్మకాండల నిర్వహణ, సామవేదంలో ఋగ్వేద మంత్రాల ఆలాపనా విధానం తప్ప, రహస్యాలేవీ లేవని తేల్చి వేసింది. వేదం తొలి భాగమైన సంహిత మాత్రమే తొలినాటి రచన అనీ వేదాంగాలని పిలువబడిన బ్రాహ్మణాలు, అరణ్యకాలు, ఉపనిషత్తులు అనంతరకాలపు రచనలు అనీ, ఋగ్వేద రచన క్రీ.పూ. 2000–1500 మధ్య కాలంలో జరిగిందనీ, ఉపనిషత్తులు క్రీ.పూ. 800–600 మధ్య కాలానికి చెందినవనీ కాల నిర్ణయం చేసింది.

చరిత్ర ఈ నిర్ణయంలో మానవుల నాగరికతాభివృద్ధినీ, భాషా లిపుల పరిణామాన్ని పరిగణనలోకి తీసుకుంటుంది. లిపి రూపొందక పోవడమే వేదాలు లిఖితరూపం తీసుకోక పోవడానికీ, కేవలం అనుశ్రుతంగా వల్లె వేయడానికి కారణమనీ నిర్ధారించింది.

మతానికి ఈ గొడవలేమీ లేవు. నారాయణుడి నాభి నుంచి పుట్టిన కమలంలో ఉద్భవించిన బ్రహ్మముఖం నుంచి వేదాలు పుట్టాయని చెప్పేస్తుంది. వ్యాసుడనే రుషి ఒక్కటిగా ఉన్న వేదాలను నాలుగుగా విభజించాడని అనేస్తుంది. సోమకుడనే అసురుడు వాటిని ఎత్తుకుపోయి సముద్రంలో దాక్కుంటే విష్ణువు మత్స్యావతారమెత్తి రక్షించాడని అంటుంది. మధ్యయుగాల దాకా లిపిబద్ధం కాని వేదాలను ఏ రూపంలో ఉండగా సోమకుడు ఎత్తుకుపోయాడో మతానికి సంబంధం లేదు.

మతంలో మాదిరిగా చరిత్రలో విష్ణు, బ్రహ్మాది దేవతలు ఆది యందు ఉండరు. రుగ్వేద దేవతలలో వరుణుడిది ప్రథమస్థానం. ఇతడు దేవతలకు రాజు. తర్వాతి స్థానం యుద్ధదేవత అయిన ఇంద్రుడిది. కాగా మూడు, నాలుగు స్థానాలు అగ్ని, సోమదేవులవి. ఆకాశదేవత అయిన ద్యుస్, భూదేవత పృథ్వి, సకల దైవాల తల్లి అదితి, పశుసంరక్షక పూషన్, ఉషస్సుకు దారిచూపే అశ్వనీదేవతలు అప్పటి ఇతర దేవతలు.

రుగ్వేదంలో అనేకులుగా ఉన్న సూర్యదేవతల్లో ఒకడిగా తొలిసారి కనిపించిన విష్ణువు అనంతర కాలంలో త్రిమూర్తుల్లో ముఖ్యుడిగా పరిణామం చెందాడు. మలివేదకాలపు ప్రధాన దేవత ప్రజాపతి తరువాతి కాలంలో ఎందుకో మరి కనిపించకుండా పోయాడు. సింధులోయ నాగరికతలో కొమ్ముల దేవుడిగా కనిపించిన పశుపతి, రుద్రుడై, శివుడై ఆర్య ద్రావిడ సంస్కృతీ సమ్మేళనానికి నిదర్శనంగా విష్ణువుతో కలిసి త్రిమూర్తుల్లో స్థానం పొంది మొదటిస్థానానికి పోటీదారు అయ్యాడు.

తనకు ప్రాతినిధ్యం వహించే వర్గమేదీ లేకపోవడం వల్ల బ్రహ్మ పూజార్హత కోల్పోవలసి వచ్చింది. మొత్తం మీద ముగ్గురూ ముందుకొచ్చేసరికి మిగిలినవాళ్లంతా వెనుక స్థానాల్లో సర్దుకున్నారు. మానవ నాగరికతలో ఒక పనిముట్టో, ఒక వ్యవస్థో మానవ చేతన ననుసరించి వివిధ రూపాలను తీసుకున్నట్టు దేవుడు, మతభావనలు కూడా రకరకాల రూపాలు తీసుకుంటాయనే చారిత్రక దృక్కోణం నుంచి మతాన్ని పరిశీలిస్తే కనిపించే దృశ్యం ఇది.

ఎంత చర్చించినా ఇంకా చర్చించవలసిన అంశం దేవ–దానవ సంఘర్షణ. మతం దేవతలు, రాక్షసులు ఇద్దరూ మనుషులే కాదన్నట్టు, వారి మధ్య యుద్ధాలు ఏవో లోకాల్లో జరిగినట్టూ మాట్లాడుతుంది. మతం దృష్టిలో మనుషుల కంటే దేవతలు ఉన్నతులు, రాక్షసులు అధములు. అయితే ఇద్దరూ మనుషులేననీ, ఇది ఆర్య, ద్రావిడ సంఘర్షణ అనీ అంటుంది చరిత్ర.

పట్టుధోవతీలు కట్టుకుని, కంఠాభరణాలు, భుజకీర్తులు, కిరీటాలు ధరించి పసుపుపచ్చగా మిసమిసలాడుతూ కనిపించే దేవతల్నీ... మిడిగుడ్లతో, బండ పెదవులతో, బానపొట్టలతో జుగుప్స కలిగించే కరిమబ్బుల్లాంటి రాక్షసుల్నీ మన ఊహల్నించి చెరిపివేయగలిగితే ప్రాథమికంగా వరుసగా తెల్లగా, నల్లగా ఉండే ఆర్య, ద్రావిడ జాతులు ప్రత్యక్షమౌతాయి.

దేవతలు చేసే యజ్ఞాది క్రతువులను రాక్షసులు విచ్ఛిన్నం చేసేవారనే ఉదంతాలకు, భిన్నమైన పూజా పద్ధతులు గల ప్రొటో ఆస్ట్రాలాయిడ్లు, ద్రావిడులు అనే స్థానిక జాతులు కొత్తగా దేశంలోకి ప్రవేశించి యజ్ఞం ఆరాధనా విధానంగా కలిగిన ఆర్య జాతిని ప్రతిఘటించాయనే సహేతుకమైన అర్థం చెబుతుంది చరిత్ర.

సంఘర్షణతో మొదలైనా సహజీవనం అనివార్యమై సమ్మేళనానికి దారితీసిన ఆర్య, ద్రావిడ సంస్కృతులకు ప్రతినిధి దేవతలు శివుడు, విష్ణువూ. ఇద్దరి మధ్యా జరిగిన ఆధిపత్య పోరాటం రెండు సంస్కృతుల మధ్య జరిగిన పోరాటమే.

తమ గోవులకు పచ్చికబయళ్లను అన్వేషించుకుంటూ దేశంలోకి ప్రవేశించి, స్థానిక నాగజాతిని అణగదొక్కిన ఆర్యుల దేవుడు పాలకడలిలో శేషతల్పమున కాక ఎక్కడుంటాడు? ఆదివాసుల దేవుడైనందుకు శివుడు సృష్టి సాధనమైన లింగరూపంలో ఆరాధించబడి శ్మశానాలలో సంచరించే జంగమదేవరే కదా అవుతాడు!

విజేత మతం – చరిత్ర రాస్తే దశావతారాలూ తమ దేవుడికే దక్కి, హాలాహలం మాత్రం ఓడినవాడి గొంతుకు అడ్డం పడుతుంది. భస్మాసుర కథైనా, మోహినీ వృత్తాంతమైనా సమస్య సృష్టించడం తెలివితక్కువవాడి వంతైతే పరిష్కరించడం మన వంతు.

ఇది అటుంచితే, చరిత్ర ఈ ఇద్దరు దేవుళ్లనీ రెండు పరిణామ దశలుగానే చూస్తుంది. నడుము చుట్టూ జంతుచర్మమూ, మెడలో పాము, క్షణికావేశము, నిష్కపటత్వమూ, భోళాతనమూ నాగరిక పూర్వ మానవుడి లక్షణాలు. ఇక వస్త్రధారణ మొదలు శంఖచక్రాలు, మెడలో పూలమాల, కిరీటం, సమస్యని పరిష్కరించుకోగల తెలివితేటలు, చాకచక్యమూ అనంతరకాలపు మానవుడి లక్షణాలు. ఇవే ఇద్దరిలో ప్రతిఫలించాయంటుంది చరిత్ర.

ఉత్తమ లక్షణాలున్న మనుషులకు దైవత్వం ఆపాదించడం కోసం దేవుణ్ణి అవతారాలెత్తించడం మతం చేసే ఒక విన్యాసం. చారిత్రకవ్యక్తి కంటే పౌరాణిక వ్యక్తికి అవతారపురుషుడు కాగలిగే వెసులుబాటు ఎక్కువ ఉంటుంది. ఈ పరిణామాన్ని మత చరిత్రలో భాగంగా చూస్తుంది చరిత్ర. మతం కృష్ణుణ్ణో, రాముణ్ణో, విష్ణువు అవతారం చెయ్యడానికి చాలా శ్రమపడుతుంది. వాళ్ల చుట్టూ గాథలల్లుతుంది. ఇతిహాసాలు రచింపచేస్తుంది. సంకీర్తనలు రాసి గానం చేస్తుంది. కుదరకపోతే చివరకు 'అంతా నేనే, నువ్వు నిమిత్తమాత్రుడివి' అని ఆయన చేతే గీతాబోధ చేయిస్తుంది.

పిల్లలతో ఆడుకుంటూ అన్నం తినడమే మరచి పోయిన బాలకృష్ణుణ్ణి రమ్మని పిలుస్తూ యశోద పాడే ఒక జానపదగీతంలో ఎన్ని రకాల ఆశలు చూపిస్తూ రమ్మని పాడినా కృష్ణుడు రాడు. అప్పుడు 'యదువంశ ధీరాయ, శ్రీమన్నారాయణ వాసుదేవ వేగ రావేరా' అంటుంది. అనగానే 'నారాయణ యంచు నవ్వుతు పిలచితే నాడే వత్తునింత సేపేలా' అని బదులిస్తాడు.

నారాయణుడంటేనే పలుకుతాను అనడం మన చేత పలికించడం కోసమే. మహాభారతంలో అనేక సందర్భాలలో ధృతరాష్ట్రుడు, భీష్ముడు, ద్రౌపది మొదలైన పాత్రలు పదేపదే 'నువ్వే వాసుదేవుడివి, నువ్వే వాసుదేవుడివి' అని కృష్ణుణ్ణి అనడం మనచేత అంగీకరింప చెయ్యడానికే. పౌండ్రక వాసుదేవుడి ఉదంతం వాసుదేవుడి స్థానం కోసం మరికొందరు ప్రయత్నించారని చెబుతుంది. అవతారాల పరిణామాన్ని సారస్వతంతో పాటు ఇతర ఆధారాలతో బేరీజు వేస్తుంది చరిత్ర. కృష్ణావతారాన్ని వైదిక మతం హిందూమతంగా మారే సంధిదశగా గుర్తించారు చరిత్రకారులు.

మతానికి ఇదేమీ పట్టదు. వేదాలను, శృతులను, స్మృతులను, ఇతిహాసాలను, పురాణాలను, కలగూరగంపను చేస్తుంది. ఎప్పుడేది కావాలంటే దాన్ని పైకి తీస్తుంది. దేన్నైనా దేనిగానైనా మారుస్తుంది. ముందునూ వెనుకనూ, భూమినీ ఆకాశాన్ని ఏకం చేస్తుంది. స్థలకాలాలూ హేతువు దానికి పూచిక పుల్లలు. ఊహలు, కట్టుకథలు పట్టుకొమ్మలు.

*(ఆంధ్రజ్యోతి దినపత్రిక నుండి సేకరణ)*

చర్చ:
# వైద్య విధానంలో గతితార్కిక పద్ధతి-హోమియోపతి

**- మంజీర**

ప్రపంచ వ్యాప్తంగా నేడు అనేక వైద్య విధానాలు వున్నాయి. వాటన్నింటినీ పరిశీలించి చూస్తే రెండు రకాల వైద్య పద్ధతులున్నాయని చెప్పవచ్చు. 1) వైరుధ్య పద్ధతి 2) సారూప్య పద్ధతి. వైరుధ్య పద్ధతి అంటే వైరుధ్యాలను వైరుధ్యాలతోనే నిరోధించాలనే సూత్రం ఆధారంగా పనిచేసేది. అంటే రోగ లక్షణాలకు వ్యతిరేకమైన లక్షణాలను కలిగించగలిగిన పదార్థాన్ని యిచ్చి రోగనివారణ చేసే పద్ధతి. అంటే రోగి నిద్రలేక బాధపడుతుంటే నిద్రతెప్పించే పదార్థాన్ని యివ్వడం, రోగికి నొప్పి అనిపిస్తుంటే నొప్పిని మరపించే పదార్థాన్ని యివ్వడం ఈ వైరుధ్య పద్ధతి. బాధ తెలియకుండా చేయడానికి, నిద్రతెప్పించడానికి నల్లమందు యివ్వడం గతంలో విరివిగా వుండేది. ఈ వైరుధ్య పద్ధతి చాలా ప్రాచీనమైనది. కాని గతంలో ఇప్పుడున్నంత సున్నితంగా లేదు. నేడు అలోపతిగా పిలువబడుతున్న ఇంగ్లీషు వైద్యం ఈపద్ధతి పైననే అభివృద్ధి అయింది.

సారూప్య పద్ధతి అంటే, సారూప్యాలను సారూప్యాలతోనే తొలగించాలనే పద్ధతి. అంటే రోగికి ఏ లక్షణాలైతే వున్నాయో, అవే లక్షణాలను కలిగించ గలిగిన 'పదార్థాన్ని మందుగా' యివ్వడం ద్వారా ఆ రోగాన్ని తొలగించే పద్ధతి. ఉదాహరణకు ఒక రోగి నిద్రలేక బాధపడుతుంటే, ఆరోగ్యవంతునిలో నిద్ర రాకుండా చేయగలిగిన పదార్థాన్ని ఇవ్వడం ద్వారా ఆ వ్యాధిని తొలగించడం సారూప్య పద్ధతి. ఈ పద్ధతిపై ఆధారపడి అభివృద్ధి అయినదే హోమియోపతి వైద్యవిధానం.

ఈ సారూప్యఔషధ పద్ధతి, ఒక పద్ధతిగా డా॥ శామ్యూల్ హానిమన్‌కు ముందు లేనప్పటికీ, ప్రజలు తమ అనుభంలో కొన్ని మూలికలను, పదార్థాలను వ్యాధి నివారకశక్తి కలిగినవిగా గుర్తించి ఉపయోగించేవారు. అవి సారూప్యమైనవి కావడం వల్లనే వ్యాధులను నివారించ గలిగేవి. 1790లో డా॥ శామ్యూల్ హానిమన్ (1755 - 1843) సింకోనా బెరడుతో తాను చేసిన ప్రయోగాల ఆధారంగా "సారూప్యాలను సారూప్యాలు నిరోధిస్తాయి" అనే సూత్రాన్ని నిర్ధారించుకొని, దానిపై ఆధారపడి హోమియోపతి వైద్య విధానాన్ని అభివృద్ధి చేసాడు. అప్పుడే అందుకు వ్యతిరేకమైన పద్ధతిని అలోపతి అని పిలిచాడు. ఆ పేర్లే నేడు అంతటా వాడుకలో వున్నాయి.

వైద్య విధానంలో ఈ రెండు పద్ధతులను మొట్ట మొదట గుర్తించినవాడు, వైద్యపితామహుడు అయిన హిప్పోక్రటస్ (క్రీ.పూ. 460-377.) ఆ తర్వాత వచ్చిన మరో గ్రీకు వైద్యుడు గాలెన్ (130 -200), వైరుధ్య సూత్రానికే ప్రాధాన్యతనిచ్చి ప్రచారం చేయడంతో, సారూప్య పద్ధతి తెరమరుగైపోయింది. ఎదురు ప్రశ్నించే వాళ్ళులేక, ఈ పద్ధతి అనేక వెర్రితలలు వేసి, మోటు పద్ధతుల్ని సంతరించుకొన్నది. ఉదాహరణకు జ్వరం వచ్చినప్పుడు గుండె వేగంగా కొట్టుకుంటుంది కాబట్టి, జ్వరం తగ్గాలంటే గుండె వేగం తగ్గించాలని, అందుకోసం రక్తం ఓడ్చితేగాని గుండె వేగం తగ్గదని, కనుక జ్వరం తగ్గాలంటే రక్తం ఓడ్చడం కన్నా గత్యంతరం లేదని భావించే వారు. ఇటువంటి మోటు పద్ధతులు డా॥ హానిమన్ కాలం వరకూ కొనసాగాయి. అమెరికా మొదటి అధ్యక్షుడు జార్జివాషింగ్టన్ నెత్తురును చాలాసార్లు ఓడ్చడం జరిగింది. 1799లో వాషింగ్టన్ మరణించేనాటికి, ఆయన శరీరంలో రక్తం అడుగంటిపోయింది.

తాను స్వయంగా ఆలోపతి డాక్టరు పట్టాపొంది, ప్రాక్టీసు ప్రారంభించిన డా॥ శామ్యూల్ హానిమన్, ఆనాటి అనాగరిక పద్ధతులతో అసంతృప్తి చెందాడు. "రోగులకు రోగం కన్నా చికిత్సే బాధాకరంగా వుందని" భావించి ఆ వైద్యాన్ని వదలిపెట్టాడు. ఆ తరువాత ఆధునిక మైన, శాస్త్రీయమైన హోమియోపతి వైద్య విధానాన్ని రూపొందించాడు.

## వైరుధ్యపద్ధతా, సారూప్యపద్ధతా? ఏది గతితార్కికమైనది ?

వైరుధ్యపద్ధతి, సారూప్య పద్ధతులలో ఏది సరైనదో తెలుసుకోవాలంటే, ఏది గతి తార్కిక భౌతికవాదానికి అనుగుణమైనదో మనం పరిశీలించాలి. ఎందుకంటే సాధారణ అవగాహనతో చూస్తే, రోగలక్షణాలకు వ్యతిరేకమైన లక్షణాలు కలిగించే మందును ప్రయోగించడం ద్వారా రోగాన్ని నివారించే వైరుధ్య పద్ధతి సరియైనది అనిపిస్తుంది. అంతేగాక సారూప్య పద్ధతి అసలు ఎలా సాధ్యం అనికూడా అనిపించవచ్చు. అందుకనే ఈ సమస్యను లోతుగా పరిశీలించాలి.

ఈ విషయాన్ని అర్థం చేసుకోడానికి వైరుధ్యాన్ని సరియైన వైరుధ్యం, సరియైనది కాని వైరుధ్యం అని విభజించి చూడాలి. దీనిని సామాజికంగా విప్లవకారులు, టెర్రరిస్టుల మధ్య విభజించి చూస్తే సులభంగా అర్థం చేసుకోవచ్చు. 'ప్రజలే చరిత్ర నిర్మాతలు' అన్నది గతితార్కిక భౌతికవాద అవగాహన. వర్గపోరాటంతో ప్రజలను చైతన్యపరచి, వారిలో భాగంగా వుంటూ, వారికి నాయకత్వం వహిస్తూ, వారి ప్రతిఘటన సరియైన నిర్మాణ రూపంలో జరిగేలా చూసేవారు విప్లవకారులు. విప్లవకారుల ప్రతి ప్రయత్నం ప్రజల ప్రతిఘటనకు, ఆకాంక్షలకు, ప్రయోజనాలకు మద్దతుగా, ప్రోత్సహించి ముందుకు తీసుకు పోయేదిగా వుంటుంది. ఇది సరియైన వైరుధ్యం. ప్రజలను వదలిపెట్టి, తామే స్వయంగా పాలకవర్గాలపై యుద్ధం చేసేది టెర్రరిజం. టెర్రరిజం కూడా పాలక వర్గాలతోనే వైరుధ్యం కలిగి వుంటుంది. పాలకవర్గాలపైనే దాడి చేస్తుంది కాని, పద్ధతి శాస్త్రీయం కాదు. కాబట్టి తాత్కాలిక విజయాలు వున్నా లక్ష్యం నెరవేరదు. అందువల్ల ఇది సరియైనదికాని వైరుధ్యం.

ఈ అవగాహనను వైద్యశాస్త్రంలో అన్వయించి చూద్దాం. శరీరానికి సహజ నిరోధక శక్తి వుందన్నది ఇప్పటికే వైద్యశాస్త్రం గుర్తించిన విషయం. వ్యాధి శరీరంలోకి ప్రవేశించినపుడు, సహజరోగనిరోధక శక్తి దానిని ప్రతిఘటిస్తుంది. మరి ఇక్కడ మందు వహించవలసిన పాత్ర ఏమిటి? అది శరీరానికి అంటే సహజ రోగనిరోధక శక్తికి అందించే తోడ్పాటు ఎలా వుండాలి? మనం పై ఉదాహరణ ప్రకారం చూస్తే, మందు తానుగా వ్యాధిపై దాడిచేయడం టెర్రరిజం లాంటిది, అది శాస్త్రీయం కాదు. మందు శరీర సహజ రోగనిరోధక శక్తితో సమన్వయం కలిగి వుండి, దానిని పెంపొందించేదిగా వుండాలి. అప్పుడే అది సరైనది అవుతుంది.

"ఒక వస్తువు అభివృద్ధికి మూలకారణం అంతర్గతమే కాని బహిరంకాదు. అది వస్తువులోనే వున్న వైరుధ్యశీలతలోనే వుంది. ప్రతిఒక్క వస్తువులోనూ అంతర్గత వైరుధ్యం వుంటుంది. దాని చలనానికి, అభివృద్ధికి అదే కారణం."

"బాహ్య కారణాలు మార్పుకు షరతు, అంతర్గత కారణాలు మార్పుకు పునాది. బాహ్య కారణాలు అంతర్గత కారణాల ద్వారానే పని చేస్తాయి." కా॥ మావో.

మందు తానుగా వ్యాధిని తొలగించ పూనుకోవడం శరీర అంతర్గత చలనాన్ని పట్టించు కోకుండా, బయటి నుండి పరిష్కరించే పద్ధతి. అలాకాక సహజరోగ నిరోధక శక్తితో మందు

సమన్వయింపబడి పనిచేయడం, బాహ్యకారణం సహాయంతో అంతర్గత వైరుధ్యాన్ని, పరిష్కరించే పద్ధతి. ఇదే గతితార్కిక భౌతికవాదానికి అనుగుణమైనది, సరియైనది.

ఇప్పుడు ఎదురయ్యే ప్రశ్న, సహజరోగ నిరోధక శక్తితో సమన్వయింపబడి మందు పని చేయడం వైరుధ్యపద్ధతిలో వుందా, సారూప్య పద్ధతిలో వుందా? ఈ విషయం అర్థమైతే అలోపతి వైద్యం శాస్త్రీయమైనదా, హోమియోపతి వైద్యం శాస్త్రీయమైనదా అనేది చెప్పగలం. ఇది తెలుసుకోడానికి ముందుగా వ్యాధి అంటే అవగాహన ఏర్పర్చుకోవాలి.

హోమియోపతి అవగాహన ప్రకారం, వ్యాధి కారకం శరీరంలో ప్రవేశించినపుడు సహజ నిరోధకశక్తి దానిని ప్రతిఘటిస్తుంది. ఆ క్రమంలో మానవశరీరం కొన్ని లక్షణాలను పైకి వ్యక్తం చేస్తుంది. వాటినే రోగలక్షణాలు అంటారు. "ఈ లక్షణ సముదాయం వ్యాధి అంతర్గత స్వభావానికి ప్రతిబింబం" తప్ప వాటికవే వ్యాధి కాదు. హోమియోపతి మందు ఈ వ్యాధి లక్షణాలతో సారూప్యత కలిగి వుంటుంది. అంటే మందుగా ఉపయోగించే ఆ పదార్థం ఏ రోగలక్షణాలకైతే మందుగా ఉపయోగించ బడుతున్నదో, అవే లక్షణాలను ఆరోగ్యవంతునిపై ప్రయోగించి నపుడు వ్యక్తం చేసి వుండాలి. వ్యాధి కలిగించిన లక్షణాలు, ఈ సారూప్యమైన మందు కలిగించే లక్షణాలు ఒకటే కావడం అంటే, వ్యాధిని సహజ నిరోధకశక్తి ప్రతిఘటిస్తున్న దిశలోనే మందుకూడా ప్రతిఘటిస్తుందని అర్థం. ఆ రకంగా సారూప్యమైన మందు శరీర సహజ రోగనిరోధక శక్తి పెంపొందడానికి దోహదం చేస్తుంది. సహజ నిరోధకశక్తి వ్యాధిని తరిమి వేయడానికి సారూప్యమైన మందు ఒక పనిముట్టుగా ఉపయోగపడుతుంది. హోమియోపతి మందు వ్యాధికి సహజ నిరోధక శక్తి ఇచ్చే ప్రతిఘటనతో సారూప్యమైనది కాబట్టి, వ్యాధికి అది సరియైన వైరుధ్యం అవుతుంది.

అలోపతి అవగాహనలో శరీరం వ్యక్తం చేసే రోగలక్షణాలనే వ్యాధిగా భావించడం జరుగుతుంది. కాబట్టి, వాటిని కనబడకుండా చేయడమే వ్యాధి నిర్మూలనగా భావిస్తారు. అలోపతి మందు, అంటే వైరుధ్యమైన మందు సహజ నిరోధక శక్తిని పట్టించుకోదు. నిద్రరాని రోగ లక్షణాన్ని, నిద్ర కలిగించే పదార్థంతో తొలగిస్తారు. బాధను తొలగించడానికి బాధను తెలియకుండా చేసే మందును ఇస్తారు. కాబట్టి వైరుధ్యపద్ధతి, అంటే ఆలోపతి మందు సరియైనది కాని వైరుధ్యం అవుతుంది. వైద్యవిధానాలు మౌలికంగా అనుసరించే వైరుధ్య పద్ధతి, సారూప్య పద్ధతులలో, సారూప్య పద్ధతి గతితార్కిక భౌతిక వాదానికి అనుగుణ్యమైనదని, సారూప్య ఔషధ పద్ధతిపై అభివృద్ధి అయిన హోమియోపతి వైద్య విధానం శాస్త్రీయమైనదని, ఆధునికమైనదని ఇప్పుడు మనం స్పష్టంగా చెప్పుకోవచ్చు.

కా॥ ఎంగెల్స్ లడ్విగ్ ఫ్యూర్‌బా పై రాసిన పుస్తకంలో "సాధారణ రూపంలో ఈ సత్యాన్ని (గతితార్కిక భౌతికవాదాన్ని) కాదనేవారు ఈనాడు లేరు. కాగా మాటల్లో ఈ సూత్రాన్ని ఆమోదించడం, వాస్తవ ఆచరణలో వివిధ విజ్ఞాన విభాగాలకు దానిని వర్తింపజేయడం, ఈ రెండూ వేర్వేరు విషయాలు" అన్నాడు. కాబట్టి హోమియోపతి శాస్త్రీయతను మరింత లోతుగా అర్థం చేసుకోడానికీ, మార్క్సిజం కంటే ముందు అభివృద్ధి అయిన హోమియోపతి వైద్య శాస్త్రంలో గతితార్కిక భౌతికవాద సూత్రాలు ఎలా అన్వయింపబడి ఉన్నాయో తెలుసుకోడానికి కొన్ని ముఖ్య సూత్రాలను పరిశీలిద్దాం. **(అరుణతార ఫిబ్రవరి 2001 సంచిక నుండి)** *(ఇంకావుంది)*

# సృష్టికార్య వివరణ - ఆదికాండం మొదటి అధ్యాయం (బైబిల్)

- నెల్సన్ రష్దీ

**ఆ**దికాండం మొదటి అధ్యాయం :- ఆదియందు దేవుడా భూమ్యాకాశములను సృజించెను. భూమి నిరాకారముగాను శూన్యముగాను ఉండెను. చీకటి అఘాద జలములు పైన కమ్మియుండెను. దేవుని ఆత్మ ఆ జలములపైన అల్లాడుచుండెను. దేవుడు వెలుగుకమ్మనగా వెలుగు కలిగెను. వెలుగు మంచిదయినట్టు దేవుడు చూచెను. దేవుడు ఆ వెలుగునకు పగలనియు, చీకటి రాత్రి అని పేర్లు పెట్టెను. అస్తమయమును ఉదయమును కలుగగా ఒక దినమాయెను.

మరియు దేవుడు ఆ జలముల మధ్యనొక విశాలము కలిగి ఆ జలములను ఈ జలములను వేరుపరచునుగాకయనెను. దేవుడు ఆ విశాలమును చేసి ఆ విశాలము క్రింది జలములను విశాలము మీది జలములను వేరుపరచునుగాక యనగా ఆ ప్రకారమాయెను. దేవుడు ఆ విశాలమునకు ఆకాశమని పేరుపెట్టెను. అస్తమయమును ఉదయమును కలుగగా రెండవ దినమాయెను.

దేవుడు క్రిందనున్న జలములు ఒకచోట కూర్చబడి ఆరిన నేల కనబడునుగాకయని పలుకగా ఆ ప్రకారమాయెను. దేవుడు ఆరిన నేలకు భూమి యని పేరుపెట్టెను. జలరాశికి సముద్రమని పేరు పెట్టెను. అది మంచిదని దేవుడు చూచెను. దేవుడు గడ్డిని, విత్తనములు గల ఫలమిచ్చు వృక్షములను భూమి మొలిపించుగాకయనెను. ఆ ప్రకారమాయెను. అది మంచిదని దేవుడు చూచెను. అస్తమయమును ఉదయమును కలుగగా మూడవ దినమాయెను.

దేవుడు పగటిని రాత్రిని వేరు పరచునట్లు ఆకాశ విశాలమందు జ్యోతులు కలుగునుగాకనియు అవి సూచనలను, కాలమును, దిన సంవత్సరములను సూచించుటకై యుండును గాకనియు పలికెను. ఆ ప్రకారమాయెను. దేవుడు ఆ రెండు గొప్ప జ్యోతులను అనగా పగటిని ఏలుటకు పెద్ద జ్యోతిని రాత్రిని ఏలుటకు చిన్న జ్యోతిని చేసెను. వెలుగు చీకట్లను వేరుపరచుటకు దేవుడు ఆకాశ విశాలమందు వాటిని ఉంచెను. అస్తమయమున ఉదయమును కలుగగా నాలుగవ దినమాయెను.

దేవుడు జీవము కలిగి చలించువాటిని జలములు సమృద్ధిగా పుట్టించును గాకనియు పలికెను. పక్షులు భూమిపైని ఆకాశ విశాలమందును ఎగురును గాకనియు పలికెను. దేవుడు జలములలో వాటి వాటి జాతి ప్రకారం జలములు సమృద్ధిగా పుట్టించిన మహామత్స్యములను జీవము కలిగి చలించువాటినన్నింటిని దానిదాని జాతి ప్రకారం రెక్కలు కలిగిన ప్రతీ పక్షిని సృజించెను. అది మంచిదని దేవుడు చూచెను. దేవుడు మీరు ఫలించి అభివృద్ధి పొంది సముద్రజలములో నిండియుండుడనియు, పక్షులు భూమిమీద విస్తరించునుగాకనియు వాటిని ఆశీర్వదించెను. అస్తమయమును ఉదయమును కలుగగా అయిదవ దినమాయెను. ఈ మాటలు జలచరాలకు పక్షులకు అర్ధమయినవా?

దేవుడు వాటి వాటి జాతిప్రకారం పశువులను, పురుగులను, అడవి జంతులను భూమి పుట్టించునుగాకని పలికెను. ఆ ప్రకారమాయెను. దేవుడు ఆయా జాతుల ప్రకారము అడవి

జంతవులను, ఆయా జాతుల ప్రకారం పశువులను, ఆయా జాతుల ప్రకారం నేలను ప్రాకు ప్రతి పురుగును చేసెను. అది మంచిదని దేవుడు చూచెను. దేవుడు మన స్వరూపమందు (ఎంత మంది దేవుళ్లున్నారో?) మన పోలిక చొప్పున నరులను చేయుదము. వారు సముద్రపు చేపలను, ఆకాశపక్షులను, పశువులను, సమస్త భూమ్మీద ప్రాకు ప్రతి జంతువును ఏలుదురని పలికెను.

దేవుడు తన స్వరూపమందు నరుని సృజించెను. దేవుని స్వరూపమందు వానిని సృజించెను. స్త్రీనిగాను పురుషునిగాను దేవుడు వారిని ఆశీర్వదించెను. ఎట్లనగా మీరు ఫలించి అభివృద్ధి చెంది విస్తరించుడని, భూమిని నిండించి దానిని లోపరచుకొనుడి. సముద్రపు చేపలను ఆకాశ పక్షులను, భూమిమీద ప్రాకు ప్రతి జీవిని ఏలుడని దేవుడు వారితో చెప్పెను. దేవుడు ఇదిగో భూమి మీద నున్న విత్తనము విచ్చు ప్రతి చెట్టును మీకిచ్చియున్నాను. అవి మీకాహారమగును. భూమి మీద నుండు జంతువులన్నిటికిని, ఆకాశ పక్షులన్నిటికిని, భూమి మీద ప్రాకు సమస్త జీవులను పచ్చని చెట్లన్నియు ఆహారమగునని పలికెను. ఆ ప్రకారమాయెను. దేవుడు తాను చేసి నయావత్తును చూచినప్పుడు అది చాలా మంచిదిగా నుండెను. అస్తమయమును ఉదయమును కలుగగా ఆరవ దినమాయెను.

ఆకాశమును, భూమియు, వాటిలోనున్న సమస్తమును సంపూర్తిచేయబడెను. దేవుడు తాను చేసిన పనియంతటినుండి విశ్రమించెను. యెహోవా భూమ్యాకాశములను వాటిలో మన సమస్తమును పూర్తి చేయబడెను. దేవుడు తాను చేసిన పనియంతటి నుండి ఏడవ దినమున విశ్రమించెను. కాబట్టి దేవుడాదినమును ఆశీర్వదించి పరిశుద్ధపరచెను.

దేవుడయిన యెహోవా భూమ్యాకాశాలను చేసిన దినమందు సమస్తమును సృష్టించబడి నప్పుడు వాటి వాటి ఉత్పత్తి క్రమం ఇదే! ఆ దినమందు భూమ్యాకాశములను చేసిన దినమందు పొలమందలి ఏ చెట్టును మొలవలేదు. దేవుడు భూమిమీద వర్షము కురిపించలేదు. నేలను సేద్య పరచుటకు నరుడులేడు. దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించి వాని నాసికారంధ్రములో జీవవాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను. యెహోవా తూర్పున ఒక తోటవేసి (నిర్మించి) తాను నిర్మించిన నరుని దానిలో యుంచెను. మరియు చూపునకు రమ్యమయినదియు ఆహారమునకు మంచిదియునైన ప్రతీ వృక్షమును, ఆ మధ్య జీవవృక్షమును, మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షమును ఆ తోటలో మొలిపించెను.

ఈ బైబిల్ నందు వ్రాయబడిన "సృష్టి" కార్య వివరాలను అత్యంత శ్రద్ధగా విచక్షణా, జ్ఞానంతో ఇందలి నిజానిజాలాలోచిస్తూ ప్రతీవాక్యాన్ని గమనించగలరని కోరుచున్నాను. ఎందుకంటే అప్పటికి ఆదాము తప్ప నరమానవుడనేవాడేలేడు! ఆదాము ఆ తోట మధ్యనున్న మంచి చెడ్డల తెలివినిచ్చు వృక్షఫలములను మాత్రం తినకూడదని హెచ్చరించాడు. ఇక తదుపరి నరులను సృష్టించిన యెహోవా అసందర్భగర్భితాలైన పలుకులను జాగ్రత్తగా గమనిద్దాము.

మరియు దేవుడైన యెహోవా ఆ ఏథెను తోటను తడుపుటకు ఏథెను నుండి ఒక నది బయలుదేరి అది అక్కడి నుండి చీలిపోయి నాలుగు శాఖలాయెను. మొదటి నది పేరు

"షీషోను". అది "హవీలా" దేశమంతటి చుట్టునూ పారుచున్నది. ఆ హవీలా దేశంలోని బంగారం శ్రేష్టమయినది. అక్కడ "చోళము"ను "గోమేధికమ"ను దొరకును!

రెండవ నది పేరు "గీహోను" అది "కూషు" దేశము తూర్పువైపున పారుచున్నది!

మూడవ నది పేరు "హిద్దెకెలు" అది అష్షూరు "దేశం" తూర్పువైపున పారుచున్నది. నాల్గవ నది పేరు యూప్రటీసు. (రిఫరెన్సులో "శరాతు"అని ఉన్నది) బహుశా అది దేశము పేరేమో.

పాఠక మహాశయుల్లారా! పైన వివరించబడ్డ మేటరు చదువుతూ యుండగా మీరు ఏమనుకుంటున్నారు? ఇక్కడ మహోన్నత దేవునిగా చెప్పబడిన "యెహోవా" పాపం పప్పులో కాలేశాడు. కాదు కాని ఆయన వేసింది పప్పులో కాదు తప్పులో కాలేసినట్టు గమనించారా! విజ్ఞానులైన కొందరు గమనించేయుండవచ్చు. కాని క్రైస్తవ భక్తులు మాత్రం అలవాటుగా చదువుకొనిపోతూ యుంటారు. వారికి ఇదంతా అద్భుతంగా కనబడటమేకాక, చూచారా ఏ ఇతర మత గ్రంథాలందు లేని విధంగా మా క్రైస్తవదేవుడు సృష్టి వివరణను ఎంత విపులంగా చెప్పారో అని ప్రశంసిస్తుయుంటారు.

అయితే ఈ సృష్టి కార్య వివరణలో రెండవ అధ్యాయమందలి వివరణ సర్వాబద్ధమని రుజువౌతుంది. కాని దీనిని విడమరచి చూస్తే ఈ సృష్టికార్యం సర్వాబద్ధమని తేటతెల్లమౌతుంది. యెహోవా దివ్యవాక్కులన్నీ బూటకాలుగా తేలిపోతాయి! ఈ క్రైస్తవ మతంలోనికి కొందరు అగ్రకులాలవారు కూడ ఆకర్షితులౌతున్నారు. నాడు క్రైస్తవ కుటుంబాలు వెనకబడియున్నమాట నిజమే. కాని రోజులు మారాయి. "నేడు స్మార్ట్‌యుగం" ప్రారంభమయ్యింది. నేడు చాలామంది పెద్ద చదువులు చదివి డాక్టర్లుగాను, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగాను, జిల్లాకలెక్టర్లగాను పనిచేస్తున్నారు. మరెందరో విదేశాలలో ఉద్యోగాలు చేస్తున్నారు. వీరు రాత్రి నిద్రకు ఉపక్రమిస్తూ.... దేవా ఈ రాత్రి నాకు సుఖనిద్ర దయచేయండి. అనుదినాహారం దయచేస్తున్నందుకు నీకు వందనాలు నీ చిత్తమైతే నాకు మరియొక సూర్యోదయం అనుగ్రహించండి అంటూ దయనీయమైన ప్రార్థనా విన్నపాలు చేస్తూయుంటారు. ఉదయం లేచి బైబిల్ పఠనం చేయనిదే విధులకు వెళ్లరు. కాని ఇది బూటకాల బైబిల్ అని పొరబాటున కూడ తలంచరు. ఈ బూటకాలు బైబిల్‌నందు ఏ విధంగా నిక్షిప్తమయ్యాయో చూడండి...

యెహోవా దేవుడు ఏథెను తోటను తడుపుటకు ఒక నదిని చేశాడని, ఆ నది ఏథెనులోనే పుట్టి నాలుగైదు దేశాలచుట్టూ తిరిగిందని... ఆయా దేశాలపేర్లు అక్కడ లభించే లోహాలపేర్లు అందలి మంచి చెడ్డలు ఎందుకు వివరించవలసి వచ్చింది? అప్పటికి బైబిల్ వివరించిన ప్రకారం భూమిమీద నరమానవుడనేవాడు ఒక్కడే యున్నాడు. ఆదాము ఒక్కడే తప్ప స్త్రీ ఇంకా చేయబడలేదు. అట్టి పరిస్థితిలో ఆ దేశాల ప్రసక్తి ఎందుకు వచ్చింది? యెహోవా సృష్టించిన నది నాల్గు పాయలై... మొదటి నది "శీషోను", ఆ నది "హవీలా" దేశమంతటి చుట్టునూ పారుచున్నదని వివరిస్తూ ఆ దేశంలో బంగారం దొరకునని, అది శ్రేష్టమైన బంగారమని అక్కడ "చోళము"ను, "గోమేధికము" కూడా లభిస్తుందని వివరించుట చూడగా చిత్రంగా యుంది. అప్పటికి భూమిమీద నరమానవుడనే వాడే లేడు. ఒక్క "ఆదాము" తప్ప అప్పటికి స్త్రీని కూడ చేయలేదు. అట్టి పరిస్థితిలో ఆ దేశాలు ఎక్కడి నుండి వచ్చాయి?

ఇది చూస్తుంటే నాకు మహాకవి గురజాడ అప్పారావు జ్ఞప్తికి వస్తున్నాడు! "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్!" అన్నారు. మరి యెహోవా అలనాటి బైబిల్ రచయితలకు ఎందుకీ బోగస్ సమాచారమిచ్చాడు... మరచాను అది యెహోవా గారి పనికాదు..." తండ్రి – కుమార–పరిశుద్ధాత్మ" అని యెహోవాకు మరో మారుపేరు కూడ వుంది. అందుచే ఆయా ప్రవక్తలతో ఈత్రిత్వములోని పరిశుద్ధాత్మ దేవుడుగారు సంభాషించేవాడని బైబిల్ గ్రంథం వివరిస్తుంది. ఏది ఏమైనా ఈ సృష్టికార్యం అంతా గజిబిజిగానేయుంది. ఈ విషయాలను క్రైస్తవేతరులు నమ్ముతారు గాని, క్రైస్తవులు చచ్చినా నమ్మరుగాక నమ్మరు. ఈ రచయితలో "సాతాను" ప్రవేశించి ఇటువంటి బైబిల్ వ్యతిరేక ప్రచారం చేయిస్తున్నాడని భావిస్తారు. ఇట్టి విమర్శనా గ్రంథాలను తాకనైనా తాకరు. ఎవర్నో అనడమెందుకు..... నా ఈ బైబిల్ విమర్శనా గ్రంథాలను నా కుటుంబ సభ్యులైన నా సోదరీమణులు... నా కుమారుడు... నా కుమార్తె... నా కోడలు నేను రచించిన రచనలను పొరబాటునైనా చదవలేదు! ఈ విషయాలు చర్చించుటకు నా బంధుమిత్రులు కూడ సమ్మతించకపోగా ప్రభువాదేవా! మా నెల్సన్‌ను నీవే మార్చాలని నా కొరకు ఉపవాస ప్రార్థనలు చేస్తూ యుంటారు. ఇదంతా ఎందుకు ఈ రచనలను నా భార్యయైన జయశ్రీ కూడ చదవలేదు. ఆమె గత మే నెలలో (2018) లో మరణించింది.

## స్త్రీ ఆవిర్భావం

స్త్రీని – ఆదిమానవునిగా చెప్పబడిన ఆదాము ప్రక్కటెముకతో యెహోవా (దేవుడు) చెక్కి చిత్రించాడని సృష్టికార్యంలో బైబిల్ వివరించింది. గతంలో నేను గోదావరి ఒడ్డున బయల్పడిన ఒక పురుషుని ప్రక్క టెముకను సేకరించాను. జానడు పొడవున్న వంకర తిరిగిన ఎముకతో స్త్రీ చేయబడిందనేది అసంభవం! దేవుడు తన మంత్రశక్తితో చేశాడంటే కాస్త సహజంగా యుండేదేమో!

ఆ ప్రక్కటెముకతో స్త్రీని తయారుచేసి ఆదాము యొద్దకు తీసికొనిరాగా... ఒకటి రెండు రోజుల క్రితమే మంటి నుండి చేయబడిన ఆదాము ఆమెను చూచి ఆనందపరవశుడై కవిత్వం లాటి మాటలు చెప్పాడట... "నా ఎముకలలోని ఎముకా! నా మాంసము నా మాంసములోని మాంసమా! ఇది నరునిలో నుండి తీయబడెను. గనుక ఇది "నారి అనబడునని" మాట్లాడాడట!

ఒక్కసారి ఈ విషయం గూర్చి ఆలోచిస్తే.... ఆదాము ఆమె కంటే కాస్తముందు మట్టితో చేయబడ్డాడు. వీరిరువురు మాట్లాడుకొంటూ ఆదాముకు కవిత్వం వంటి మాటలు ఎలా వచ్చాయి? అతనిలో మాట్లాడుటకు నరమానవులెవరూ లేరు. ఆదాము ఏ భాషలో మాట్లాడాడో అంత ధారాళంగా ఎలా మాట్లాడాడు. ఇవన్నీ కల్పితాలే. ఇవన్నీ అసంభవగాధలే! అప్పుడు భాష అనేదేలేదు. మూగసైగలే!

ఆదాము తన భార్యను కూడినప్పుడు ఆమె గర్భవతి ఆయెను. మొదటి సంతానంగా కయీను, రెండవ సంతానంగా హెబెలు పుట్టారని, అంత కయీను వ్యవసాయం చేయగా... హెబెలు గొర్రెల కాపరిగా కొనసాగినట్టు వివరించబడింది! ఈ మాటలు నిజమేనా? ఒక్క క్రైస్తవునికైనా సందేహం రాదు. ఇది అసంభవమైన వివరణ. కయీనుయొద్ద నాగలిగాని... కొడవలిగాని లేదు... హెబెలు గొర్రెలు ఎక్కడి నుండి తెచ్చాడు? వారు చర్మపు దుస్తులు ధరించారట! కత్తిగాని, సుత్తిగాని లేని వీరు గొర్రెల చర్మాన్ని ఎలా ఒలిచారు?

నాటి అనాగరిక యుగాలందు మానవజాతులు రాతిపనిముట్లతో రెండు కట్టెలను రాపిడి చేసి అగ్నిని రాజేసి అంచెలంచెల అనుభవంతో వేల సంవత్సరాల అనంతరం మానవుడు నాగరికుడైయ్యాడు.

నాడు ఆదాముహవ్వల కుటుంబం ప్రసవ సమయాలందు బొడ్డుపేగు కత్తిరించాలని తెలియదు. నాటుమంత్రసానులు కూడాలేరు. ఇన్ని సాధక బాధకాలు ఆలోచించకుండా మత గ్రంథంలో వ్రాయబడిందంతా నిజమే అని భావించడం అర్థంపర్థంలేని అంధవిశ్వాసం తప్ప మరొకటికాదు.




## సైన్సు-హేతువాదం పత్రిక సంపాదకులు

## కామ్రేడ్ ఐ.వి.కు జోహార్లు!

సైన్సు-హేతువాదం పత్రిక సంపాదకులు ఇంటి వెంకటేశ్వరరావు ది. 29-03-2025 ఉదయం 5 గంటలకు ఖమ్మంలో తన ఇంటినందు శ్వాసకోశ సంబంధిత ఇబ్బందితో తుదిశ్వాస విడిచారు. ఉపాధ్యాయునిగా ఉద్యోగ విరమణ తరువాత సైన్స్-హేతువాదం పత్రిక సంపాదక బాధ్యతలు చేపట్టారు. ఐ.వి.గారి మరణం హేతువాద ఉద్యమానికి తీరనిలోటు. కా॥ ఐ.వికు నాస్తికసమాజం జోహార్లు అర్పిస్తూ- వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేస్తుంది.

- నాస్తికసమాజం


చదవండి! చదివించండి!!

**తత్త్వశాస్త్ర చరిత్ర**

**గతితార్కిక భౌతికవాదం**

రచన : **డా॥ ఆర్కే**

వెల : **రూ.120**

**ప్రతులకు :**

**బి. సుధాకర్**

**చార్వాకాశ్రమం, నిడమర్రు (పోస్టు),**

**మంగళగిరి (మండలం)**

**గుంటూరు జిల్లా - 522 503.**

**సెల్ : 9290619550, 9440101814**

# ఘనంగా జరిగిన 33వ జాతీయ నాస్తిక మేళా

2025 ఫిబ్రవరి రెండవ శనివారం, ఆదివారం 8,9 తేదీలలో గుంటూరుజిల్లా, మంగళగిరి సమీపములోని చార్వాకాశ్రమంలో 33వ జాతీయ నాస్తికమేళా జరిగింది. 8వ తేదీ శనివారం ఉదయం పది గంటలకు 'ది రేషనలిస్ట్స్ ఫోరమ్' తమిళనాడు, అధ్యక్షులు ఆర్. తమిళసెల్వన్ నాస్తిక సమాజం జండా ఆవిష్కరించారు. నాస్తికసమాజం నాయకులు బి.శ్రీనివాసరావు నినాదాలివ్వగా - భా.నా.స. నాయకులు జీడి సారయ్య బృందం గేయాలను ఆలపించారు. ఉదయం కార్యక్రమానికి ఎస్.ఎస్.ఎఫ్ కార్యదర్శి, ఫిరా సభ్యురాలు పి.మౌనిక స్వాగతం పలుకుతూ- తమ కుటుంబం నాస్తికమేళాకు ప్రతి సం॥ హాజరౌతామని, సమాజంలోని మూఢనమ్మకాల నిర్మూలనకు తాము ఎలా కృషి చేస్తున్నామో తెలియజేశారు. నాస్తిక సమాజం జాతీయ అధ్యక్షులు సిహెచ్. శివారెడ్డి ఉదయం కార్యక్రమానికి అధ్యక్షత వహించారు.

"భవిష్యత్తు ఆలోచనాపరుడు - పెరియార్" అనే అంశంపై ది రేషనలిస్ట్స్ ఫోరమ్, తమిళనాడు అధ్యక్షులు ఆర్.తమిళసెల్వన్ మాట్లాడుతూ - ఈ సమాజంలోని సాంప్రదాయవాదులతో పెరియార్ ఎంతో ఘర్షణ పడ్డారనీ, ఆ ఘర్షణలలోనుంచి పెరియార్ ఆలోచనా విధానాన్ని, భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించుకున్నారని చెప్పారు. ఆ ఘర్షణలో నుంచి పెరియార్ బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాన్ని నడిపారనీ, మతాలలోని దురాచారములకు, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నడిపారని అన్నారు. ఈ సమాజాన్ని మూఢత్వంలోకి తీసుకువెళ్ళడానికి సాంప్రదాయవాదులు; శాస్త్రీయ దృక్పథంతో ముందుకు తీసుకు వెళ్ళడానికి శాస్త్రవేత్తలు కృషి చేస్తుంటే పెరియార్ శాస్త్రవేత్తల వైపు నిలిచారని అన్నారు. పెరియార్ ఆలోచనా విధానంలో మానవత్వానికి చాలా ముఖ్యమైన స్థానం వుందని అన్నారు. సైన్స్‌ని గురించి, సమాజాన్ని గురించి, పరిపాలనా విధానాన్ని గురించి పెరియార్ అనేక విషయాలను మాట్లాడారనీ, సమాజంలోని అన్ని రకాల అసమానత్వాలకు వ్యతిరేకంగా పెరియార్ తన జీవితకాలం పోరాడారనీ అన్నారు. భవిష్యత్ పరిపాలనా విధానం గురించి పెరియార్ మాట్లాడుతూ - ప్రజాస్వామికీకరణ అయినటువంటి పరిపాలనా విధానం వుండాలనీ, అటువంటి పరిపాలనా విధానం రూపొందించినపుడే నాస్తికత్వ హేతువాద జీవితాన్ని ప్రజలు అనుభవించ గలరని తెలియచేశారు.

"సైన్స్....మీదా? మాదా?" అనే అంశంపై ఎయిమ్స్ విశ్రాంత ఆచార్యులు డా॥కె. విజయకుమార్ మాట్లాడుతూ - శాస్త్రం అనేది ఏకపక్షంగా ఒక అంశానికి పరిమితం చేయదగినది కాదు. అది నిరంతరం కొత్త ఆధారాలను విశ్లేషిస్తూ, పరిశోధనల ద్వారా అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. శాస్త్రం ఎప్పుడూ ప్రశ్నించడం, పరిశోధించడం, అనుమానించడం ద్వారా ముందుకు సాగాలని ఆయన చెప్పారు.

డార్వినిజం గురించి వివరిస్తూ, ఒక ఆసక్తికరమైన ఉదాహరణ ఇచ్చారు. ఒక కేంద్ర మంత్రి, డార్విన్ సిద్ధాంతాన్ని తప్పుబడుతూ - "కోతి నుంచి మనిషి పుట్టాడని ఎవరూ చూడలేదు" అని అన్నమాటను ప్రస్తావిస్తూ, అది ఎంతవరకూ అశాస్త్రీయమైన వాదనో వివరించారు. శాస్త్రం

అనేది వ్యక్తిగత అభిప్రాయాలపై ఆధారపడదు; అది పరిశోధనల ద్వారా నిరూపితమైన వాస్తవాలపై ఆధారపడుతుందని స్పష్టం చేశారు. జీవపరిణామం అనేది క్రమక్రమంగా, శాస్త్రీయ ప్రక్రియల ప్రకారం జరిగినదని వివరించారు. కార్బన్ అణువుల ప్రత్యేకతను వివరిస్తూ, జీవరసాయన పరిణామం ఎలా జరిగిందో, సునాయాసంగా శ్రోతలకు అర్థమయ్యేలా వివరించారు.

భౌతికశాస్త్రానికి సంబంధించి, ఐన్‌స్టీన్ సిద్ధాంతాల గురించి వివరించారు. ఆయన ప్రసంగంలో "$E=MC^2$" సిద్ధాంతాన్ని ప్రస్తావిస్తూ, పదార్థం మరియు శక్తి మధ్య అనుసంధానం గురించి చర్చించారు. శాస్త్రం నిరంతర మార్పులో ఉంటుందని, ఒక సిద్ధాంతాన్ని శాశ్వతంగా అంగీకరించడం సైన్స్ లక్షణం కాదని చెప్పారు. స్టీఫెన్ హాకింగ్, బిగ్ బ్యాంగ్ సిద్ధాంతం గురించి కూడా ఆయన తన అభిప్రాయాలను వివరించారు. “బిగ్ బ్యాంగ్ మాత్రమే పరిణామానికి ఆధారంగా ఉండకపోవచ్చు” అనే అంశాన్ని ఉద్దేశిస్తూ, శాస్త్రవేత్తలు ప్రతిదీ కొత్త ఆధారాలతో తిరిగి పరీక్షించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

శాస్త్రం మరియు మతం మధ్య వ్యత్యాసాన్ని స్పష్టంగా వివరించారు. శాస్త్రం అనేది నిరంతరం ప్రశ్నించి, ఆధారాలను బట్టి అభివృద్ధి చెందేదిగా ఉంటే, మతం మాత్రం స్థిరంగా ఒకే ఆలోచనని ఒప్పించే విధంగా పనిచేస్తుందని అన్నారు. మార్క్సిజాన్ని పూర్తిగా ఒక రాజకీయ సిద్ధాంతంగా కాకుండా, దానిని ఒక శాస్త్రీయ దృక్పథంగా చూడాలని చెప్పారు. శాస్త్రం ద్వారా మనం భవిష్యత్తును అంచనా వేయగలం, సమాజంలో మార్పులను విశ్లేషించగలం అని వివరించారు. సమాజంలో విజ్ఞానం పెంపొందాలంటే విద్యను బలోపేతం చేయడం, శాస్త్రీయ దృక్పథాన్ని ప్రోత్సహించడం అనివార్యమని అన్నారు. విద్యా వ్యవస్థను మరింత శాస్త్రీయంగా, సులభంగా అర్థమయ్యేలా రూపొందించాల్సిన అవసరాన్ని ఆయన ప్రస్తావించారు.

మధ్యాహ్న కార్యక్రమానికి నాస్తిక సమాజం నాయకులు DHG పోలప్ప స్వాగతం పలుకగా – నాస్తిక సమాజం నాయకులు ఇ.ఉమామహేష్ అధ్యక్షత వహించారు. “అభ్యుదయవాదులు తరగతి గదిని ఆసక్తికరంగా మార్చడం ఎలా?” అనే అంశంపై జనవిజ్ఞాన వేదిక నాయకులు వి.బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ – సమాజ పరివర్తన, తార్కికత, హేతువాదం, విద్యార్థుల భవిష్యత్తు, మరియు యువతపై ప్రభావం కలిగించే మూఢనమ్మకాల గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు. ఆయన తన వ్యక్తిగత అనుభవాలను పంచుకుంటూ, తన విద్యార్థి దశలో చదివిన రామకృష్ణగారి రచనలు తనలో బలమైన ఆలోచనా ధోరణిని కలిగించాయని అన్నారు. “మూఢవిశ్వాస వనకుఠారం” అనే పుస్తకం తనకు విద్యార్థి ఉద్యమాల్లో పనిచేసే సహచరులకు ఇచ్చేంతగా ప్రభావం చూపిందని వివరించారు.

ప్రస్తుత సమాజంలో యువత ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ – తల్లిదండ్రులు తమ పిల్లలకు సరైన మార్గనిర్దేశం ఇవ్వడంలో విఫలమవుతున్నారని, పైగా “నువ్వు బాగుపడితే చాలు” అనే స్వార్థపూరిత తత్వాన్ని నేర్పిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానమే యువతను తప్పుడు మార్గాల్లోకి నడిపిస్తోందని, దీన్ని అరికట్టడానికి కుటుంబ వ్యవస్థలోనే మార్పులు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్యార్థులు సమాజాన్ని మార్చే శక్తిగా ఉండాలని, సమాజాన్ని తీర్చిదిద్దే బాధ్యత వాళ్లపైనా ఉందని చెప్పారు.

మెడికల్ విద్యార్థులు కనీస నైపుణ్యాలను కూడా సంపాదించకుండా డిగ్రీలు పొందుతున్నారని ఆయన విమర్శించారు. "ఒక వైద్య విద్యార్థి ఇంజక్షన్ చేయడం తప్ప మిగతా నైపుణ్యాలు నేర్చుకోవడంలేదు" అనీ, ప్రస్తుత విద్యావ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపారు. మెడికల్ కాలేజీలను నాణ్యత గల విద్యాబోధనకు కేంద్రాలుగా మార్చాలనీ, విద్యార్థులకు సరైన ప్రోత్సాహం అందించాలి అని ఆయన అభిప్రాయపడ్డారు.

"దేశభక్తి ఉంటే, అమెరికా కంపెనీలకు మేలు చేసే బదులు, మన రైతుల ఉత్పత్తులను ప్రోత్సహించండి" అనే సందేశాన్ని ప్రజలకు అందించాలని చెప్పారు.

విద్యార్థులకు మరింత ఆసక్తికరంగా విషయాలను అందించడం ద్వారా వారిని ఆకర్షించగలమని చెప్పారు. "యువత ఏమి వినటానికి ఇష్టపడతారు?" అనే ప్రాతిపదికపై వారిని సరైన మార్గంలో తీసుకెళ్ళేలా ప్రేరేపించాలన్నారు. వివాహ, ఉద్యోగ అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం లాంటి అంశాలను ముందుగా ప్రస్తావించి, ఆ తర్వాత హేతువాదంపై మాట్లాడితే యువత ఆసక్తిగా మార్పును అంగీకరిస్తారని వివరించారు.

నేటి రాజకీయ పరిస్థితుల గురించి మాట్లాడుతూ- ప్రజలు అధిక సంఖ్యలో హేతువాద దృక్పథం కలిగి ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు. 2014 నుంచి దేశం ప్రమాదకర మార్గంలో సాగిపోతోందని, మోడీ - అమిత్‌షా పాలన వల్ల ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజలకు విద్య ద్వారా నిజమైన సమాచారం అందించాలి, మూఢనమ్మకాలను పోగొట్టాలి, అప్పుడు సమాజం ముందుకు వెళ్తుందని చెప్పారు.

మన సంస్థలన్నీ ఒకే లక్ష్యంతో పని చేయాలనీ, వ్యక్తిగత విభేదాలను పక్కన పెట్టి సమాజ హితమే ప్రధానంగా ఉండాలని చెప్పారు. యువతను హేతువాద దృక్పథంతో తీర్చిదిద్దితేనే మన భవిష్యత్తు బలంగా ఉంటుందని తెలిపారు. "ప్రజలు మనం చెప్పే ఉపన్యాసాలు వింటారు. తరువాత మన ఆచరణను చూస్తారు. మనం ఎలా ప్రవర్తిస్తామో అదే వారికి బోధపడుతుంది అనీ, అందువల్ల మనం ఆచరించేదే చెప్పాలని అన్నారు.

"లౌకికరాజ్యం - మతం - దైవదూతలు" అనే అంశంపై ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం నాయకులు సంగిరెడ్డి హనుమంతరెడ్డి మాట్లాడారు.

సాయంత్రం కార్యక్రమానికి అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం నాయకులు గంజి ఈశ్వరలింగం స్వాగతం పలుకగా - నాస్తిక సమాజం నాయకులు బి. వెంకటరెడ్డి అధ్యక్షత వహించారు. "ఆహారం-ఆరోగ్యం" అనే అంశంపై ఎన్.టి.ఆర్ హెల్త్ యూనివర్శిటీ పూర్వ రిజిస్ట్రార్ డా॥ కె.శంకర్ ఉపన్యసించారు.

ద్రవిడియన్ కల్చరల్ సెంటర్, తమిళనాడు నాయకులు ముత్తైవేందన్ మాట్లాడుతూ- తమిళనాడు నుండి ద్రవిడియన్ కల్చరల్ సెంటర్ సభ్యులము ఈ నాస్తికమేళాలో పాల్గొనడం చాలా సంతోషంగా వుందని చెప్పారు. వారికి తెలుగు భాషలోని ఉపన్యాసాలు అంతగా అర్థం కాకపోయినా కొంతవరకు అర్థం చేసుకున్నామనీ, ప్రత్యామ్నాయ సంస్కృతి నిర్మాణంలో భాగంగా ఈ నాస్తికమేళా 33 సం॥లుగా నిర్వహించడం గొప్ప విషయమనీ ఇంక నుంచి ప్రతీ నాస్తికమేళాలో తమ సంస్థ తరఫున పాల్గొంటామనీ అన్నారు.

మతవాదులు ప్రతీ వీధుల్లో, పట్టణాల్లో మత ప్రచారాలను విస్తృతంగా చేస్తున్నారనీ, కానీ మన భౌతికవాదులము మన శాస్త్రీయ ప్రచారాన్ని చేయలేక పోతున్నామనీ ఆవేదన వ్యక్తం చేశారు. తాము గత 45 సం॥లుగా పెరియార్ ఆశయాలను ప్రచారం చేస్తూ, ఆచరిస్తున్నామని అన్నారు. మూఢనమ్మకాల గురించి మాట్లాడుతూ - 26 సం॥ క్రితం తమ కుటుంబంలోని 5గురు సభ్యులు వేరు వేరు మతాలు, వేరు వేరు కులాల వారితో అమావాస్య రోజున పెళ్ళిళ్ళు మత సాంప్రదాయాలకు వ్యతిరేకంగా దండల పెళ్ళి చేసుకున్నామనీ, ఆ రోజున - 6 నెలలకు మించి మేము బ్రతకమనీ, మా జాతకాలు కలవలేదనీ, జ్యోతిష్యులు అన్నారు. ఆ విషయాన్ని వివిధ వార్తాపత్రికల వారు యముడు మామీద పాశం విసురుతున్నట్లు కార్టూన్ వేసి వార్తను ప్రచురించారు. కానీ మా పెళ్ళై 26 సం॥ అయ్యింది. మా పిల్లలు కూడా ఉద్యోగాలు చేస్తూ స్థిరపడ్డారు. అందువలన జ్యోతిష్యాలు, వాస్తు, మొ॥ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా మనం వివరిస్తూ ఆచరించి చూపాలని కోరారు.

ది. 09-02-2025 ఉదయం కార్యక్రమానికి నాస్తికసమాజం నాయకులు DHG పోలప్ప స్వాగతం పలుకగా - జనవిజ్ఞాన వేదిక నాయకులు ఎన్. స్వరాజ్యలక్ష్మి అధ్యక్షత వహించారు. "భారతదేశంలో ఫాసిజం" అనే అంశంపై మానవహక్కుల వేదిక, తెలంగాణ నాయకులు డా॥ ఎస్. తిరుపతయ్య మాట్లాడుతూ - ఫాసిజం, భారతదేశంలో ఫాసిజం రూపాలు, దాని మూలకారణాలు, లక్షణాలు, మరియు సామాజిక ప్రభావం అనే అంశాలపై విస్తృతంగా విశ్లేషించారు. ఫాసిజం ప్రపంచ రాజకీయాలలో ఎలా అభివృద్ధి చెందిందో, అలాగే భారతదేశంలో ప్రస్తుత పరిస్థితులలో అది ఎలా అమలవుతోంది అనే దానిపై స్పష్టమైన విశ్లేషణను అందించారు.

ఫాసిజానికి సరైన నిర్వచనం లేదు. కానీ, అన్ని ఫాసిస్టు పాలనలలో కొన్ని సాధారణ లక్షణాలు ఉంటాయి అని ఆయన వివరించారు. ముఖ్యంగా, ప్రపంచ యుద్ధాల మధ్యకాలంలో ఇటలీ, జర్మనీ వంటి దేశాలలో ఫాసిజం ఎలా పుట్టిందో, ఫాసిస్ట్ పాలనల ప్రత్యేకతలు ఏమిటో విశ్లేషించారు.

భారతదేశంలో ఫాసిజం అనేది ఇతర దేశాలతో పోల్చితే ప్రత్యేకమైన రూపాన్ని కలిగి ఉందని డా॥ తిరుపతయ్య వివరించారు. భారతదేశంలో ఫాసిజానికి ప్రధానంగా మూడు ముఖ్యమైన సాంఘిక, రాజకీయ, మరియు ఆర్థిక కారణాలు ఉన్నాయని చెప్పారు.

ఫాసిస్ట్ ప్రభుత్వం ఎన్నికల ద్వారానే అధికారంలోకి వస్తుంది, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థను నిర్వీరం చేస్తుంది. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, మీడియా, పార్లమెంటు లాంటి స్వతంత్ర రాజ్యాంగ సంస్థలను అణచివేయడం ఫాసిజం లక్షణం అని అన్నారు.

అధికారాన్ని కేంద్రీకరించడం ద్వారా పార్లమెంటును ప్రహసనంగా మార్చడం, ప్రతిపక్షాలను అణచివేయడం, అసమ్మతిని ధిక్కరించకుండా చేయడం ద్వారా నియంతృత్వ పాలన స్థాపించ బడుతుంది. న్యాయవ్యవస్థను పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకురావడం ద్వారా ప్రజలకు న్యాయం దొరకకుండా చేస్తారు.

అతిగా జాతీయవాదం మరియు మతతత్వాన్ని ప్రజలలో పెంచుతారు. "జాతీయవాదం" అనే పేరుతో మెజారిటీ వర్గాన్ని ప్రోత్సహిస్తూ, మైనారిటీలను శత్రువులుగా చూపడం. భారతదేశంలో "హిందూ జాతీయవాదం" అనే భావనను పెంచుతూ, ముస్లిములను, క్రిస్టియన్లను, ఇతర మతస్థులను దేశ ద్రోహులుగా చిత్రీకరించడం. బ్రాహ్మణీయ ఆలోచనలను ప్రోత్సహిస్తూ, మనువాద ధోరణులను తిరిగి స్థాపించాలనే ప్రయత్నం, ప్రజలను భయాందోళనకు గురి చేయడానికి, మూకదాడులు, దౌర్జన్యాలు, లవ్‌జిహాద్, గోరక్షణ దాడులు లాంటి హింసాత్మక చర్యలు నిర్వహించడం. మతపరమైన హింసను పోలీసులు, న్యాయవ్యవస్థ గాని నియంత్రించకుండా చేయడం. ప్రభుత్వ నియంత్రిత మీడియా ద్వారా ఫేక్ న్యూస్, తప్పుడు కథనాలు, అసత్య ప్రచారాలు నడపడం, సామాజిక మాధ్యమాల్లో "ఐటిసెల్" ల ద్వారా భిన్నాభిప్రాయాలను అణచివేయడం, పోలరైజేషన్ పెంచడం, విద్యా వ్యవస్థను నియంత్రించి, కొత్త తరాలకు అసత్య చరిత్రను బోధించడం. పౌర హక్కులను నిర్వీర్యం చేయడం, అసమ్మతిని తీవ్రంగా అణచివేయడం. చేస్తున్నారు అని అన్నారు. భారతదేశంలో ఫాసిజం పెరగడానికి రెండు ప్రధాన కారణాలు ఉన్నాయి. అవి:

**1. సాంఘిక కారణాలు - బ్రాహ్మణీయ ఆధిపత్యాన్ని కాపాడే ప్రయత్నం :** బ్రాహ్మణీయ శక్తులు వీరికి గతంలో ఉన్న అధికారం కోల్పోతున్నాయని భావిస్తున్నాయి. అందుకే, కులవ్యవస్థను, హిందూ ధర్మాన్ని, మనుధర్మ సిద్ధాంతాలను పునరుద్ధరించాలని ప్రయత్నం చేస్తున్నాయి.

**2. ఆర్థిక కారణాలు - కార్పొరేట్ల అనుకూల పాలన** : ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండే రంగాలను ప్రైవేటీకరించడం, కార్పొరేట్లకు బహుమతులివ్వడం ద్వారా సామాన్య ప్రజల ఆర్థిక పరిస్థితిని తీవ్రంగా దెబ్బతీస్తున్నారు. పెట్టుబడిదారులకు పూర్తిగా లబ్ధి కల్పించే విధంగా ప్రజల హక్కులను హరించడమే ఫాసిజం లక్ష్యం. ఫాసిజం భారత్‌లో ప్రజాస్వామ్యానికి, లౌకికతకు, మానవ హక్కులకు పెద్ద ప్రమాదం అని డా॥ తిరుపతయ్య హెచ్చరించారు. ఫాసిజాన్ని అర్థం చేసుకుని, ప్రజలను చైతన్యపరచడం, అసత్య ప్రచారాలను ఎదిరించడం, రాజ్యాంగాన్ని పరిరక్షించడం మన తక్షణ కర్తవ్యమని అన్నారు.

"పెరుగుతున్న ఫాసిజం - మన కర్తవ్యాలు" అనే అంశంపై ఆం.ప్ర. విద్యా పరిరక్షణ కమిటి కన్వీనర్ రమేష్ పట్నాయక్ మాట్లాడుతూ - భారతదేశంలో పెరుగుతున్న ఫాసిజం, ఆధిపత్య వ్యవస్థలు, మతతత్వం, కుల వ్యవస్థ, మరియు ప్రజాస్వామ్య భవిష్యత్తు వంటి అంశాలను విపులంగా వివరించారు.

ఫాసిజం అనేది కేవలం ఒక రాజకీయ వ్యవస్థ కాదని, ఇది ఆధిపత్య వర్గాల ప్రయోజనాలను కాపాడే ఒక విధానం అని ఆయన పేర్కొన్నారు. వర్గ ఆధిపత్యం అంటే కార్మికుల మీద పెట్టుబడిదారుల ఆధిపత్యం, రైతాంగం మీద ధనిక రైతుల ఆధిపత్యం, గిరిజనుల మీద ప్రభుత్వ మరియు వ్యాపార వర్గాల ఆధిపత్యం అనీ, సామాజిక ఆధిపత్యం అంటే కులం, మతం, ప్రాంతం, భాష, జాతి, లింగం ఆధారంగా ఏర్పడే అసమానతలు అని అన్నారు.

నేడు ఆర్.ఎస్.ఎస్ ముస్లింలకు వ్యతిరేకమే కాదు, అన్ని మైనారిటీలకు వ్యతిరేకం. క్రిస్టియన్లు, బౌద్ధులు, సిక్కులు - వీరిందరినీ వ్యతిరేకించే విధంగా ఆర్.ఎస్.ఎస్ మతతత్వాన్ని ఉపయోగిస్తోంది. మనుధర్మాన్ని తిరిగి స్థాపించేందుకు మతాన్ని రాజకీయంగా ఉపయోగిస్తున్నారు

అని అన్నారు. ఫాసిజం కేవలం మతవాదం మాత్రమే కాదు, ఇది కులవ్యవస్థను నిలబెట్టేందుకు పనిచేసే మనువాదం అని ఆయన స్పష్టంగా చెప్పారు.

ముస్లింల మీద ద్వేషాన్ని పెంచడం వెనుక అసలు ఉద్దేశం కుల అసమానతలను కాపాడుకోవడం. దళితులు, శూద్రులు సమాన హక్కులు పొందేందుకు ఇస్లాం, క్రిస్టియన్ మతాలను అంగీకరించడంతో అగ్రవర్ణ శక్తులకు సమస్య ఏర్పడింది. ఫాసిజం కేవలం మత ఆధారంగా కాకుండా దళితులపై ఆధిపత్యాన్ని కొనసాగించడమే అసలు లక్ష్యం అని అన్నారు. సనాతన ధర్మం అంటే ఒకే కాలానికి చెందిన వ్యవస్థ కాదు. వేదకాలం, బౌద్ధకాలం, పౌరాణిక కాలం, భక్తి ఉద్యమం – వీటిలో ప్రతి దశలో హిందుత్వ భావన మారుతూ వచ్చింది. ప్రస్తుతం "సనాతన ధర్మం" అనే భావన ప్రామాణిక చరిత్ర ఆధారంగా కాకుండా, రాజకీయ ప్రయోజనాల కోసం తయారు చేయబడింది అని అన్నారు.

**ప్రజాస్వామ్యాన్ని నియంత్రించడం** – ఎన్నికల ద్వారానే ఫాసిస్ట్ శక్తులు అధికారంలో వచ్చి, తర్వాత ప్రతిపక్షాలను అణచివేస్తాయి. **మతతత్వాన్ని పెంపొందించడం** – హిందూ జాతీయవాదం పేరుతో మైనారిటీలను టార్గెట్ చేయడం. **న్యాయవ్యవస్థ మరియు రాజ్యాంగ సంస్థల నిర్వీర్యం** – కోర్టులు, ఎన్నికల సంఘం, ఇతర సంస్థలను పూర్తిగా ప్రభుత్వ నియంత్రణలోకి తీసుకోవడం. **తప్పుడు ప్రచారం (Fake News Propaganda):** ప్రచార యంత్రాంగాన్ని ఉపయోగించి అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేయడం. **ఆర్థిక మోసాలు** – కార్పొరేట్ల కోసం ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరించడం, సామాన్య ప్రజలకు కలిగే లాభాలను తొలగించడం వంటివి భారతదేశ ఫాసిజం లక్షణాలు అని అన్నారు. ఫాసిజాన్ని ఎదుర్కొవడం కోసం మనం **ప్రజలను చైతన్యవంతం చేయాలి** : ఫాసిజం ఎలా పని చేస్తుందో, దీని అసలు లక్ష్యాలు ఏమిటో తెలియజేయాలి. **భిన్నత్వాన్ని, రాజ్యాంగ విలువలను రక్షించాలి** : హిందూత్వ ఫాసిజానికి బదులుగా ప్రజాస్వామ్య విలువలను ప్రోత్సహించాలి. వర్గ పోరాటాలను మాత్రమే కాకుండా, సామాజిక వివక్షకు కూడా వ్యతిరేకంగా పోరాడాలి. కులవ్యూహ్యాన్ని పూర్తిగా అర్థం చేసుకొని, దానికి వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించాలి అని అన్నారు. ప్రజలు చరిత్రను సరిగా అర్థం చేసుకొని, ఫాసిజాన్ని ఓడించే మార్గాలను అభివృద్ధి చేయాలి అని ఆయన తన ఉపన్యాసాన్ని ముగించారు.

"మనుధర్మమా? రాజ్యాంగ ధర్మమా?" అనే అంశంపై శ్రీమతి వెలగపూడి దుర్గాంబ సిద్ధార్థ న్యాయకళాశాల ప్రిన్సిపాల్ చెన్నుపాటి దివాకర్‌బాబు మాట్లాడుతూ – భారత రాజ్యాంగం, మనుధర్మం, సనాతన ధర్మం, హిందుత్వం మరియు రాజకీయ పరిణామాల గురించి విశ్లేషణాత్మకంగా వివరించారు. ఆయన ముఖ్యంగా భారత రాజ్యాంగ విలువలను, వాటిపై ప్రస్తుత రాజకీయ విధానాల ప్రభావాన్ని వివరించారు.

దివాకర్‌బాబు రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఆయన మనుధర్మం ఎలా కులవ్యవస్థను నిలబెట్టిందో, రాజ్యాంగం దానిని ఎలా వ్యతిరేకించిందో వివరించారు. మనుధర్మం ప్రకారం వ్యక్తి యొక్క హోదా అతను ఏ కులంలో పుట్టాడో ఆధారపడి ఉండేది, కానీ రాజ్యాంగం మనుధర్మ వ్యవస్థను ఖండించి "సమానతా హక్కులను" అందరికీ అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నారు.

హిందుత్వాన్ని ఒక రాజకీయ అస్త్రంగా ఉపయోగిస్తున్న తీరు ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. సావర్కర్ ద్విజాతి సిద్ధాంతాన్ని ఎలా ప్రవేశపెట్టాడో, అది మతాన్ని రాజకీయంగా వాడేందుకు ఎలా మారిపోయిందో వివరించారు. 1925లో ఆర్‌ఎస్‌ఎస్ ఏర్పడినా, స్వాతంత్ర్య పోరాటంలో వారికి ఎటువంటి పాత్రలేదని స్పష్టంగా చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత, ఆర్.ఎస్.ఎస్ రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూ "మనుధర్మాన్ని పునరుద్ధరించాలి" అని ప్రస్తావించిందని తెలిపారు.

సనాతన ధర్మంలోని మూల ప్రామాణిక విషయాలను పరిగణనలోకి తీసుకుని వాటిపై విమర్శనాత్మక దృష్టితో ఆయన చర్చించారు. కర్మ సిద్ధాంతం, కుల ధర్మం, పునర్జన్మ సిద్ధాంతం, స్త్రీలపై వివక్ష - ఇవన్నీ సనాతన ధర్మంలో వేరు చేసిన అంశాలని వివరించారు. "కుల ధర్మాన్ని పాటిస్తేనే ముక్తి లభిస్తుంది" అనే భావనను తూర్పారబట్టారు.

రాజ్యాంగం ద్వారా అణగారిన వర్గాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇచ్చి, కుల వివక్షను తగ్గించేందుకు ప్రయత్నించిందని చెప్పారు. అయితే, ప్రస్తుత పాలకులు రాజ్యాంగ విలువలకు భంగం కలిగించే విధంగా "సనాతన ధర్మాన్ని రక్షించాలి" అని చెప్పడం వెనుక ఉన్న మత ప్రేరిత ఆలోచనలను ఎత్తిచూపారు.

ప్రస్తుత పాలకులు రాజ్యాంగాన్ని నిర్వీరం చేసే చర్యలకు పాల్పడుతున్నారని ఆయన వివరించారు. "మాకు 400 సీట్లు ఇచ్చినట్లయితే రాజ్యాంగాన్ని మారుస్తాం" అని బీజేపీ ఎంపీలు చెప్పిన ఉదాహరణను పేర్కొన్నారు. రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మార్చలేమని సుప్రీంకోర్టు చెప్పినా, ప్రజలు అప్రమత్తంగా లేకపోతే రాజ్యాంగానికి ప్రమాదం కలుగవచ్చని హెచ్చరించారు.

ఒకప్పుడు త్రిపురనేని రామస్వామి, కందుకూరి వీరేశలింగం పంతులు వంటి మహానుభావులు సామాజిక న్యాయం కోసం పోరాడారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుత సమాజంలో ప్రత్యామ్నాయ సంస్కృతి లేకపోవడం, ప్రజల్లో చైతన్యం లేకపోవడం వల్ల రాజ్యాంగ విలువలు ప్రమాదంలో పడుతున్నాయన్నారు. ప్రజలు ఈ అంశాలను అర్థం చేసుకుని, అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

చివరిగా - రాజ్యాంగ విలువలను కాపాడేందుకు ప్రతి పౌరుడూ కృషిచేయాలని, మనుధర్మం ముసుగులో రాజ్యాంగాన్ని నిర్వీరం చేసే యత్నాలను ఎదుర్కోవాలని అన్నారు. ప్రజల హక్కులను పరిరక్షించేందుకు చైతన్యం పెంపొందించుకోవడం, రాజ్యాంగాన్ని సమర్థంగా అవగాహన చేసుకోవడం ఎంతో కీలకం అని ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

మధ్యాహ్న కార్యక్రమానికి ఫూలె, పెరియార్, అంబేద్కర్ ఆలోచనా వేదిక నాయకులు రంగ ప్రశాంత్ స్వాగతం పలుకగా - ప్రముఖ భౌతికవాది సావంత్ సుధాకర్ అధ్యక్షత వహించారు.

"మతము - మతతత్త్వము" అనే అంశంపై భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు బి.రామయ్య మాట్లాడుతూ - మతము గురించి కార్ల్‌మార్క్స్ మాట్లాడుతూ - మనిషే మతాన్ని సృష్టించాడు. మతం మనిషిని సృష్టించలేదు. ఇది మత విమర్శకు పునాదిగా వుండాలి. తనను తాను అర్థం చేసుకోలేని మనిషి, తనను తాను కోల్పోయినటువంటి మనిషి, మతాన్ని ఒక స్వీయ చైతన్యంగా భావించాడు. మతం అనేది అణచివేయబడిన జీవుల నిట్టూర్పు. హృదయం లేని ప్రపంచంలో హృదయం అని అన్నారు. కేవలం దేవున్ని విమర్శించడం ద్వారానే మతాన్ని రద్దు చేయలేమనీ, మతము అందించే భ్రమలను కలిగించే పరిస్థితులు కూడా పోవాలి అని అన్నారు.


మన దేశంలో మనుధర్మశాస్త్రము అనేది అదనపు విలువను పొందేవారు రూపొందించారు. దీనిని ఉత్పత్తి వ్యవస్థలో భాగంగానే చూడాలి. అదనపు విలువను పొందుతున్నవారు, శ్రామికులుగా వున్న వారిని అలాగే వుంచడానికి ఆనాటి వ్యవస్థను యధాతథంగా వుంచడానికి ధర్మాల రూపంలో తాత్త్విక ముసుగును రూపొందించారు. భగవద్గీతలో కూడా వర్ణవ్యవస్థను కాపాడుకోవడానికి కర్మసిద్ధాంతాన్ని కృష్ణుడు చెప్పినట్లు గీతాకారుడు అనేక రూపాలలో చెప్పాడు. మతం ఎప్పుడైనా, ఎక్కడైనా దోపిడీని, వివక్షను సమర్థిస్తుంది. ఇది మతములో వున్నటువంటి తత్త్వము అని అన్నారు.

“కులనిర్మూలన” అనే అంశంపై కుల నిర్మూలనా పోరాట సమితి నాయకులు కె.కృష్ణ మాట్లాడుతూ – మా కుల నిర్మూలనా పోరాట సమితి స్థాపించినప్పుడు చార్వాక రామకృష్ణ గారితో అధ్యయన తరగతులు నిర్వహించుకున్నాము. అప్పటి నుంచి ఇప్పటి వరకు చార్వాకాశ్రమంతో మాకు సన్నిహిత సంబంధాలున్నాయని అన్నారు. కుల నిర్మూలన సాధ్యమేనా? ఇక్కడ చాలామందిమి వున్నాము. నాస్తికులుగా, కమ్యూనిస్టులుగా చెలామణి అవుతున్నాము. కానీ బయటకు వెళ్ళిన తర్వాత హిందువులుగానే వుంటున్నాము. ఈ సమాజంలో కుల నిర్మూలనను మనం కోరుకుంటున్నామా? అసమానతలున్న ఈ సమాజంలో కుల నిర్మూలనను ఎలా సాధించగలం? ఈ దేశంలో వున్న కుల సమస్యను, వాటి మూలాలను మొదటిగా పరిశీలించిన వాడు డా॥ బి.ఆర్. అంబేద్కర్. ఈ కుల వ్యవస్థ మూలాలు వర్ణాశ్రమ ధర్మాలలో వున్నాయి వర్ణాశ్రమ ధర్మాల మూలాలు బ్రాహ్మణీయ మతంలో వున్నాయి. అందువలన బ్రాహ్మణీయ భావజాల వ్యవస్థను నిర్మూలన చేయకుండా కుల నిర్మూలన చేయలేము అని అన్నారు. ఈ దేశంలో ఆత్మగౌరవం కలిగిన ఏ దళితుడూ ఈ దేశం నాదని చెప్పలేకపోతున్నారు అని అన్నారు. నేడు భారతరాజ్యాంగం అమలులో వుంది. అంటరానితనం లేదు. దళితులు ఆత్మగౌరవంతో బ్రతుకుతున్నారు అని అంటున్నారు. కానీ వారం రోజుల క్రితమే మంచినీటి కుండను ఒక దళిత విద్యార్థి పట్టుకున్నాడని ఆధిపత్య వర్గానికి చెందిన గురువే అతనిని శిక్షించిన ఉదంతం వెలుగులోకి వచ్చింది.

రాజ్యం అండతోనే మన దేశంలో దళితులపై అత్యాచారాలు జరుగుతున్నాయి. చాలామంది OC, B.C కులాల వారిని కలిసినపుడు వారు నాతో ‘కుల నిర్మూలన’ జరగాలంటున్నారుగా మరి రిజర్వేషన్లు ఎందుకు అని అడుగుతున్నారు. దానికి సమాధానంగా కులాలు వున్నంతవరకు రిజర్వేషన్లు వుండాలని చెప్పాను. 10 సం॥రాలు రిజర్వేషన్లు వుంటే నా జాతి అభివృద్ధి చెందుతుంది అని అంబేద్కర్ భావించారు. కానీ 75 సం॥ భారత రాజ్యాంగం అమలులో వున్నా కుల సమస్య, అంటరాని సమస్య ఇంకా వున్నాయి. ఆధిపత్య కులాల వారు దళితులలో వున్న అవకాశవాదులను తమ పంచన చేర్చుకుని పాలకవర్గ భావజాలాన్ని అంబేద్కర్ భావజాలంగా ప్రచారం చేయిస్తున్నారు. నేడు మాల –మాదిగల మధ్య చిచ్చుపెట్టి, ఒక వర్గాన్ని ఆర్.ఎస్.ఎస్‌కు దగ్గరగా చేర్చే ప్రయత్నాలు చేస్తున్నారు. నిజమైన కుల నిర్మూలన కావలసినవారు పల్లెల్లో వున్నారు. ఈ దేశంలో అన్ని కులాలలో వున్న పేదవారి నాయకత్వంలో ఈ దేశంలో కమ్యూనిస్టు పార్టీలు ఉద్యమాలు చేసినప్పుడే మన పోరాటాలు విజయవంతమవుతాయని అన్నారు.

"నాస్తికవాద కార్యాచరణ - వారి అనుభవాలు - కర్తవ్యాలు" అనే అంశంపై చర్చను భారత నాస్తిక సమాజం నాయకులు జీడి సారయ్య, ప్రముఖ నాస్తికులు చైతన్య గంగిరెడ్డి నిర్వహించారు. ప్రజాకళామండలి కళాకారులు కోటి, రాణి బృందం, ఆం.ప్ర. ప్రజానాట్య మండలి కళాకారులు ఆర్.పిచ్చయ్య, ఎ.రామారావు, భా.నా.స. కళాకారులు జీడి సారయ్య బృందం, పొంతపల్లి రామారావు, బాల కళాకారిణి కూరపాటి సింధు చేసిన జానపద నృత్యం, జనవిజ్ఞాన వేదిక, విజయవాడ వారు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా చేసిన శాస్త్రీయ ప్రచారం, ఆం.ప్ర. ప్రజానాట్య మండలి విజయవాడ శాఖ వారిచే "రైతు నృత్యం" మొ॥గు సాంస్కృతిక ప్రదర్శనలు ఆలోచన కలిగించాయి. గోపు చంద్రరావు, కన్నెబోయిన అంజయ్యలు నాస్తిక, హేతువాద, అభ్యుదయ పద్యాలాపన చేయగా - జనసాహితి నాయకులు దివికుమార్, హేతువాది వై.వి.రమణారావులు కవితలు చదివి వినిపించారు. నాస్తికసమాజం నాయకులు ఎ.భాస్కర్ 33వ నాస్తికమేళాకు ముగింపు పలికారు.

**వస్తువుల బైటికి కనబడే రూపమూ, వాటి సారమూ నేరుగా ఒకటేలా సరిపోలితే సకల శాస్త్రాలూ అనవసరం అయిపోతాయి - కార్ల్‌మార్క్స్**




**సాంఘిక, ఆర్థిక పోరాటాలూ బొమ్మా బొరుసు వంటివి - రామకృష్ణ**

**నాస్తికోద్యమ వైతాళికుడు, నాస్తికమేళా రూపశిల్పి, చార్వాకాశ్రమ వ్యవస్థాపకులు, సాంస్కృతికోద్యమ స్ఫూర్తిప్రదాత**

## చార్వాక రామకృష్ణ 18వ వర్ధంతి సభ

**ది. 18-4-2025 శుక్రవారం**

**ఉదయం 10గం. నుండి సాయంత్రం 5 గం. వరకు**

**వేదిక : రావణ మైదానం, చార్వాకాశ్రమం, నిడమర్రు**

# గతితార్కిక భౌతికవాదం

సంక్షిప్తంగా - సులభంగా

**స్వాగతం : కె. బెన్‌హర్‌బాబు,** నాస్తిక సమాజం

**అధ్యక్షత : టి. రాజారావు,** పౌరహక్కుల సంఘం నాయకులు

**వక్త : రమేష్ పట్నాయక్,** కన్వీనర్. ఆం.ప్ర. విద్యా పరిరక్షణ కమిటీ

**—— భోజనం విరామం ——**

**చర్చ : గతితార్కిక భౌతికవాద దృక్పథంలో నేటి సామాజిక పరిస్థితులు**

ఈ చర్చలో అందరూ పాల్గొనవచ్చును.

# అంతర్జాతీయ మహిళా దినోత్సవం వర్ధిల్లాలి !

- బత్తిని శ్రీనివాసరావు

**అం**తర్జాతీయ మహిళా దినోత్సవం (IWD) 20వ శతాబ్దం ప్రారంభంలో యూరప్ మరియు ఉత్తర అమెరికాలోని కార్మిక ఉద్యమాల నుండి ఉద్భవించింది. సమాజంలో మహిళలపై కొనసాగుతున్న అణచివేత, అత్యాచారాలు, వివక్షతలు, అసమానతలకు వ్యతిరేకంగా కార్మిక ఉద్యమాలు మొదటి నుండి వివిధ రూపాల్లో పోరాడుతూనే వచ్చాయి. ఆ పోరాటాల పరంపరలో భాగంగానే అమెరికాలోని న్యూయార్క్ నగరంలో మార్చి 8, 1908న, దుర్భరమైన పని పరిస్థితులను నిరసిస్తూ 15,000 మంది మహిళలు పని గంటల తగ్గింపు , వేతనాల పెంపు, మహిళల ఓటు హక్కును డిమాండ్ చేస్తూ ప్రభుత్వాన్ని ధిక్కరిస్తూ గొప్ప ప్రదర్శన జరిపారు. ఇది దేశాన్నంతా ప్రభావితం చేసింది. సోషలిస్ట్ పార్టీ ఆఫ్ అమెరికా పిలుపు మేరకు 1909 ఫిబ్రవరి 28న యునైటెడ్ స్టేట్స్ అంతటా మొదటి జాతీయ మహిళా దినోత్సవం (NWD) జరుపుకున్నారు. నాటినుండి ఆ దేశంలో 1913 వరకు ఫిబ్రవరి చివరి ఆదివారం నాడు మహిళలు జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవడం కొనసాగించారు.

1910లో కోపెన్‌హాగన్‌లో రెండవ అంతర్జాతీయ శ్రామిక మహిళల సమావేశం జరిగింది. జర్మనీలోని 'సోషల్ డెమోక్రటిక్ పార్టీ' మహిళా నాయకురాలు క్లారా జెట్కిన్ అంతర్జాతీయ మహిళా దినోత్సవం ప్రతిపాదనను సమావేశం ముందుంచింది. ప్రతి సంవత్సరం ప్రతి దేశంలో ఒకే రోజున - మహిళా దినోత్సవం - జరుపుకోవాలని ఆమె ప్రతిపాదించింది. మహిళల డిమాండ్ల కోసం ఒత్తిడి తీసుకురావాలని ఆమె ప్రతిపాదించింది. యూనియన్లు, సోషలిస్ట్ పార్టీలు, శ్రామిక మహిళా క్లబ్‌లకు ప్రాతినిధ్యం వహిస్తున్న 17 దేశాల నుండి 100 మందికి పైగా మహిళలు - ఫిన్నిష్ పార్లమెంటుకు ఎన్నికైన మొదటి ముగ్గురు మహిళలతో సహా - జెట్కిన్ సూచనను ఏకగ్రీవంగా ఆమోదించారు. దీనితో మొదట కొన్ని యూరోపియన్ దేశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ నిర్వహణకు సన్నాహాలు మొదలయ్యాయి.

కోపెన్‌హాగన్‌లో నిర్ణయం ప్రకారం, 1911 మార్చి 19న ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ మరియు స్విట్జర్లాండ్‌లలో మొదటిసారిగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. పని చేయడానికి, ఓటు వేయడానికి, శిక్షణ పొందడానికి, ప్రభుత్వ పదవులను నిర్వహించడానికి మరియు వివక్షను అంతం చేయడానికి మహిళల హక్కుల కోసం జరిగిన ఆ అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీలలో పది లక్షలకు పైగా మహిళలు-పురుషులు పాల్గొన్నారు. అయితే, ఒక వారం కంటే తక్కువ సమయంలోనే మార్చి 25న న్యూయార్క్ నగరంలో జరిగిన అతి విషాదకరమైన 'ట్రయాంగిల్ ఫైర్'లో 140 మందికి పైగా శ్రామిక మహిళల ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘోర సంఘటన యునైటెడ్ స్టేట్స్‌లోని పని పరిస్థితులు మరియు కార్మిక

చట్టాలపై శ్రామిక ప్రజల దృష్టిని ఆకర్షించింది, ఇది తదుపరి అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాలకు బలమైన ప్రేరణగా పనిచేసింది.

మొదటి ప్రపంచ యుద్ధానికి వ్యతిరేకంగా శాంతి కావాలని డిమాండ్ చేస్తూ, రష్యన్ మహిళలు 1914 ఫిబ్రవరి 23న చివరి ఆదివారం తమ మొదటి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం గ్రెగోరియన్ క్యాలెండర్ ప్రకారం మార్చి 8న జరుపుకోవాలని అంగీకరించారు. 1914లో యూరప్ అంతటా మహిళలు యుద్ధానికి వ్యతిరేకంగా ప్రచారం చేయడానికి, మహిళల సంఘీభావాన్ని తెలియజేయడానికి యునైటెడ్ కింగ్‌డమ్‌తో సహా అనేక ర్యాలీలు నిర్వహించారు. లండన్‌లో మార్చి 8, 1914న మహిళల ఓటు హక్కుకు మద్దతుగా బో నుండి ట్రఫాల్గర్ స్క్వేర్‌కు గొప్ప మార్చ్ జరిగింది. ట్రఫాల్గర్ స్క్వేర్‌లో ప్రసంగించడానికి వెళుతుండగా సిల్వియా పాంఖర్స్ట్‌ను చారింగ్ క్రాస్ స్టేషన్ ముందు అరెస్టు చేశారు.

మార్చి 8, 1917న రష్యాలో మహిళా వస్త్ర కార్మికులు ప్రపంచ యుద్ధానికి, ఆహార కొరతకు, జారిస్టు పాలనకు వ్యతిరేకంగా "రొట్టె – శాంతి" కావాలని పెట్రోగ్రాడ్ నగరంలో గొప్ప ప్రదర్శనను నిర్వహించారు. ఇది ఫిబ్రవరి విప్లవానికి నాంది పలికింది. అంతిమంగా అక్టోబర్ విప్లవ విజయానికి దారితీసింది.

వర్గ దోపిడీని నిర్మూలించే పోరాటమే స్త్రీ విముక్తికి మార్గం అని లెనిన్‌తో సహా కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు, శ్రామిక మహిళా నాయకురాళ్లు చాటి చెబుతూ ఆ లక్ష్యంలో భాగంగా వ్లాదిమిర్ లెనిన్ 1922లో మార్చి 8 ని అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ప్రతి సంవత్సరం జరపాలని ప్రకటించారు. దీనిని ప్రపంచ వ్యాపితంగా కమ్యూనిస్ట్ ఉద్యమం, కమ్యూనిస్ట్ దేశాలు సమ్మతించి ఆ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా శ్రామిక మహిళల్లో వర్గ చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో అనేక కార్యక్రమాలను నిర్వహించడం ప్రారంభించాయి. 1977లో ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గుర్తించిన తర్వాత, ప్రపంచ మహిళా ఉద్యమాల ఒత్తిడి ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా చాలా దేశాలు మార్చి 8 ని సెలవుదినంగా ప్రకటిస్తున్నాయి. ప్రపంచంలో మహిళలకు ఈ కనీస హక్కులన్నీ శతాబ్దాల పోరాటం, అంతులేని త్యాగం తర్వాత మాత్రమే వచ్చాయి. ఈ పురోగతి ప్రపంచ వ్యాపిత ఉద్యమాల వల్లనే జరిగింది.

నేటి సమాజంలో మహిళలపై అణచివేతలు, అత్యాచారాలు, దోపిడీ పీడనలు కొనసాగడానికి, నేటి పెట్టుబడిదారీ దోపిడీ విధానమే మూలం. సమాజంలో ఒక వర్గంపై మరో వర్గం దోపిడీ సాగుతున్నంత కాలం మహిళలు అణచివేతలకు, వివక్షతలకు గురికాక తప్పదని, వర్గ దోపిడీని నిర్మూలించే పోరాటమే అంతిమంగా స్త్రీ విముక్తికి మార్గం అని 177 సంవత్సరాల క్రితమే శాస్త్రీయ కమ్యూనిజం చాటింది. రష్యా అక్టోబర్ విప్లవం తదుపరి సోవిట్ యూనియన్‌లో జరిగిన సోషలిస్టు సమాజ నిర్మాణ ప్రయోగాలు ఆచరణలో ఈ సత్యాన్ని రుజువు చేశాయి. కావున సకల సమస్యలకు మూలమైన ఈ దోపిడీ సామాజిక వ్యవస్థ నిర్మూలనకు, సమసమాజ స్థాపనకు పూనుకోవడమే మన ముందున్న ఏకైక మార్గం.

# ఘనంగా జోతిరావుపూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్ అంబేద్కర్ విగ్రహముల ఆవిష్కరణ..



జాతీయ సైన్స్ దినోత్సవంను పురస్కరించుకొని పూలే, పెరియార్, అంబేద్కర్ ఆలోచన వేదిక ఆధ్వర్యంలో బెల్లంపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో మహనీయుల విగ్రహా ఆవిష్కరణ ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి రంగ ప్రశాంత్ అధ్యక్షత వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పూలే, అంబేద్కర్ సెంటర్ ఫర్ ఫిలసాఫికల్ అండ్ ఇంగ్లీష్ ట్రైనర్, ప్రొఫెసర్ సుదర్శన్ బాలబోయిన, విజ్ఞాన దర్శిని అధ్యక్షులు రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ – శాస్త్రీయ విద్యావిధానం, ప్రస్తుత పరిస్థితుల్లో సైన్స్ ఎదుర్కొంటున్న సవాళ్లు, మూఢవిశ్వాసాలతో ప్రజలు వెనుకపడుతున్న పరిస్థితులపై వివిధ అంశాల పట్ల వారు మాట్లాడారు. ఈ దేశానికి మహాత్మ, పూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్, అంబేద్కర్ చేసిన సేవలు గురించి క్లుప్తంగా విద్యార్థులకు వివరించడం జరిగింది. జాతీయ సైన్స్ డే సందర్భంగా వివిధ ప్రభుత్వ కళాశాలలకు, గురుకులాలకు, జూనియర్ కళాశాలకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన సందర్భంగా వచ్చిన ముఖ్య అతిథులతో విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ప్రజలలో, విద్యార్థుల్లో సైన్స్ భావనలు పెంపొందించడం ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహాత్మ జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, పెరియార్, అంబేద్కర్ వల్లనే ఈ దేశ ప్రజలకు విద్య, వివేకం, విజ్ఞానం కలిగాయని వక్తలు అన్నారు.

ప్రముఖ హైకోర్టు న్యాయవాది కాంపెల్లి ఉదయకాంత్ మాట్లాడుతూ – విద్యార్థుల్లో చదువు పట్ల ఆకర్షితులు కావడానికి సహకరిస్తున్న పూలే , పెరియార్, అంబేద్కర్ ఆలోచనా వేదిక, మహనీయుల విగ్రహ ప్రతిష్టాపన కమిటీ సభ్యులను కొనియాడారు..

ఈ కార్యక్రమంలో బీసీ మహిళ సంక్షేమ సంఘం అధ్యక్షురాలు ఎర్ర సువర్ణ, కవి రచయిత తోటపల్లి భూమన్న, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు తోకల రాజేశం, డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ కాంపల్లి శంకర్,  సి ఓ ఈ బాలుర ప్రిన్సిపల్ శ్రీధర్, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సరిత, విజయలక్ష్మి, విగ్రహ ప్రతిష్ట కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గొడిసెల శ్రీహరి, డిఆర్ శ్రీధర్, కమిటీ సభ్యులు బిఏ. జ్యోతి కుమార్, ఎలుపుల కనకయ్య, గొడిసెల స్వామి, అక్కు ఉమ, కృష్ణ, దుబాసి రవి, గొడిసెల చంద్రమౌళి, ఎల్తూరి శంకర్, జంజర్ల రవిరాజ్, కృష్ణపల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మతం గుప్పిట్లో మహిళ

(గత సంచిక తరువాయి)

- కొల్లా వెంకటేశ్వర్లు

**హిం**దూ మతం పవిత్రంగా భావించే భారత రామాయణ భాగవతాది గ్రంథాలను పరిశీలిస్తే స్త్రీలపై ఎంత కుట్రపన్నిందీ అర్థం చేసికోవచ్చు!

క్రీ.శ. 9-10 శతాబ్దాలకు చెందిన చోళ చాళుక్య యుగాలనాటికే స్త్రీ బానిసత్వం పరాకాష్ట నందుకొన్నట్లు కొన్ని పరిశీలనల ద్వారా తెలుస్తుంది.

ఆంధ్ర శబ్ద చింతామణిలో నన్నయ -

"స్త్రీ పశుజడాన్ విన్యే మహదాఖ్యాః" అన్నారు.

స్త్రీ పశు జడాలను ఏకంగా ఒకేగాట కట్టారాయన. స్త్రీలను హీనంగా చిత్రించిన ప్రతివాడూ మహాకవిగా పిలువబడ్డాడు. గ్రంథాలేమో పవిత్రంగా ఆరాధించబడ్డాయి.

స్త్రీలకు ముట్టు సమయంలో రక్తస్రావం ప్రకృతి సహజం. కాని దాన్నొక హీనంగా వర్ణించారు. పురాణ వేత్తలు. కూర్మ పురాణంలో వామనుడెలా రాసాడో చూడండి.

"స్త్రీ ణాం స్మరణజం పాపం, మాసి మాసి రజస్థలాత్
నాశ్యతే పురుష సంసర్గే, గర్భేత్యాగో విధీయతే -

పై శ్లోకానికి అర్థం ...

"స్త్రీలు మానసికంగా చేసే వ్యభిచారమనే పాపమే, వాళ్ళకు నెలనెల ముట్టు రక్తరూపంలో స్రవిస్తుంటుంది. ఆ పాప దోషం పురుష సంపర్కం వలన పోతుంది" అని.

ఆనాటి వేదాల దగ్గర నుండి ఇతిహాసాల వరకూ అన్ని బ్రాహ్మణాధిక్యతను ప్రచారం చేసేవే.

ఒక స్త్రీకి బ్రాహ్మణేతరులు పది మంది ఉన్నా ఆవిడ చేతిని బ్రాహ్మణుడు పట్టుకుంటే మాత్రం అతడే దాని మొగుడు" అని వేదఘోష. (ఉదయత్ఫతయో దశస్త్రీయా పూర్వే ఆ బ్రాహ్మణాః, బ్రహ్మచేత్ హస్తగ్రహీత్ స ఏవ పతిరేకధా - శ్రుతి)

ఇతిహాసయుగంలో స్త్రీకి పాతివ్రత్యం విధించడమేగాక, ఆమెను విలాస వస్తువుగా చూడటం జరిగింది. రామాయణ, భారతాలు రెండింటిలోనూ ప్రతిభావంతమైన స్త్రీ యెక్కడా కన్పించదు. భారతంలో ద్రౌపది కేవలం పావు మాత్రమే. పాండవులు ద్రౌపదిని కేవలం ఒక పావు మాదిరిగానే జూదంలో ఓడిపోయారు. పాండవులు రాజ్యాధికారంలో వుంటే, లేదా అడవుల్లో వుంటే వారినే అనుసరించి బ్రతుకుతుందామె. ఆనాడు బహు భర్తృత్వం అమలులో వుంది. భీమార్జునులు తాము వేరేచోట్ల భార్యలను పొంది బిడ్డలను కన్న ఘటనలు కలవు. అది వారి మగతనం క్రింద లెక్క. ఐతే ద్రౌపది మాత్రం నిర్జీవంగా వుంటుంది. యుద్ధ సమయంలో అవసరాన్ని బట్టి కర్ణుణ్ణి గూడా వరింపజేయటానికి ద్రౌపదిని సిద్ధపరుస్తారు పాండవులు.

రామాయణ కాలంలో బహుభార్యాత్వం అమలులో వుంది. ఎవడో ఒక దానయ్య చెప్పిన మాట విని రాముడు భార్యను అడవులలోకి పంపుతాడు. అదీ అడవులకని చెప్పి పంపడు. సీత

గర్భవతి, విహారానికి వెళ్ళాలని కోరిందట. ఆ కోరిక తీర్చడానికై పంపుతున్నాననే వంకతో అడవులకు పంపుతాడు. పూర్తిగా మోసపు ధోరణి రాముడిది. అటువంటి రాముణ్ణే ఆరాధ్యదైవంగా భావిస్తుంది స్త్రీ లోకం. ఆడది కేవలం ఆటబొమ్మగా, పురుషుల చేతి కీలుబొమ్మగా కాలం గడిపింది.

ఇతిహాసాల్లో అమలుపరచిన కఠిన నిబంధనలు, వారికి తగిలించిన సంకెళ్ళు అక్కడక్కడా ఆడది అవినీతికి దిగజారడానికి తోడ్పడ్డాయి. తన లోపం లేకుండా జరిగిన నేరానికి అహల్య శాపానికి గురైంది. శూర్పణఖ తన అడవుల్లో తిరుగుతున్న రాముణ్ణి ప్రేమించింది. రాముని కోరితే హేళనగా లక్ష్మణుణ్ణి జూపుతాడు. లక్ష్మణుడు తిరిగి రాముణ్ణి చూపుతాడు. ఎట్టకేలకు లక్ష్మణుడు తన పరాక్రమమంతా చూపి ఆమె ముక్కు చెవులు కోస్తాడు.

అరణ్యంలోనూ సీతకు కట్టుబాట్లు అమలులోనే వున్నాయి. స్త్రీ వీరులకు భోగ వస్తువు అని చెప్పడానికి తార వృత్తాంతం చాలు.

భారతంలో భీష్ముడు తన తండ్రికి సత్యవతితో పెళ్ళి జరిపిస్తాడు. అంటే కడు వృద్ధుడనే నియమం లేకుండా స్త్రీలకు పెళ్ళి జరిగిందని తెలిసికోవచ్చు.

పాండురాజు రోగిష్టి కనుక భర్తను కలువగూడదని నియమం. ఐతే పాండురాజు ఆ నియమాన్ని త్రోసిరాజని భార్యతో సంభోగిస్తాడు. ఫలితం అతని మరణం. అతడు మరణించగానే "మాద్రి" భర్త చితిపై పడి మరణించింది. అంటే సహగమనం కూడ అమల్లో వుందని తెలిసికోవచ్చు.

కుంతి పెళ్ళి కాకుండానే బిడ్డను కంటుంది. ఆనాడు అతిథికి ఇంటి యజమాని భార్యను కాని, కూతుర్నిగాని నియోగించాలట ఆ నీతి ఫలితమే కర్ణుడి జననం.

కుంతి పాండురాజుని పెళ్ళి చేసికొన్నా - యమ ధర్మరాజువల్ల ధర్మరాజుని, వాయువువల్ల భీముడిని, ఇంద్రుని వలన అర్జునుణ్ణి, అశ్వినీ దేవతల వలన నకుల, సహదేవులను కంటుంది. ఈ అక్రమ సంబంధాలు అవినీతి క్రిందకు లెక్కకురావు, చట్టబద్ధమైనవిగానే పరిగణింపబడ్డాయి.

భర్త గ్రుడ్డివాడు కనుక తాను గ్రుడ్డిదానిగనే జీవించాలని నిర్ణయించుకొని నూరుపాళ్ళూ పాతివ్రత్యాన్ని నిరూపించుకొంది గాంధారి.

ఇతిహాసయుగంలో స్వయంవరం ఒక నాటకం. స్వయంవరం అంటే తానే స్వయంగా వరించుట అని అర్థం. కాని ఆచరణలో అది పెద్ద మోసం.

రామాయణంలో శివధనుస్సు విరిచినవాడు రాముడుగాక రావణుడైనా మరే పుల్లయ్యా ఐనా సీత వరించవలసిందే.

భారతంలో ద్రౌపదీ స్వయంవరంలో బ్రాహ్మణ వేషంలో అర్జునుడు ద్రౌపదిని గెల్చుకొంటాడు. మరెవరు గెల్చుకొన్నా చేయగలిగింది లేదు. ద్రౌపదిని గెల్చుకున్న అర్జునుడామెను అన్నదమ్ము లందరితోపాటు పంచుకొంటాడు. అంతేగాని ఆమె మనస్సును గురించి ఆలోచించలేదు.

సహగమనాలు, బహుభార్యత్వం - ఇతిహాస కాలంలో అమల్లోవుండి స్త్రీ జనాన్ని పిప్పి చేసాయి.

*(ఇంకావుంది)*

## ఆవు గురించి నిజాలు.. అబద్ధాలు, అపోహలు..

*1. ఒక ఆవుకు ప్రతిరోజూ కొంత మోతాదులో విషం ఇవ్వడం జరిగింది. 24 గంటల తర్వాత ఆ ఆవు రక్తం, మూత్రం, పేడ, పాలు పరీక్షించబడ్డాయి. ఎక్కడో తెలుసా? న్యూఢిల్లీ లోని 'ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' (ఎయిమ్స్) పరిశోధనాశాలలో. ఇలా ఒక రోజు, రెండు రోజులు కాదు, 90 రోజుల పాటు పరిశోధించడం జరిగింది. పరిశోధకులు ఆ ఆవు పాలు, రక్తం, మూత్రం, పేడలలో ఎక్కడా విషపు ఛాయలను కూడా కనుగొనలేకపోయారు. ఆ విషం ఎటుపోయింది? గోమాత విషం మొత్తాన్ని తన గొంతులో దాచుకుంది. ఏ ఇతర జంతువుకూ లేని ప్రత్యేక లక్షణమిది!*

'ఎయిమ్స్' లోని కొందరు బోధనాచార్యులను నేను అడిగి తెలుసుకున్న విషయమేమంటే... అక్కడ అలాంటి ప్రయోగమేదీ జరగలేదు. ఆ సంస్థకు చెందిన 'జంతువుల నైతిక విలువల కమిటీ' ఏ జంతువుకైనా ప్రయోగం కోసమైనా, ఒక్క రోజైనా విషం ఇవ్వడానికి అంగీకరించదని అక్కడి ఆచార్యులు నొక్కి వక్కాణించారు!

*2. విషాన్ని విరిచే శక్తి ఆవు పాలకు ఉంది.* విషం అనే పదం చాలా విస్తారమైనది. ఏ విషం? సయనైడా? డీడీటీనా? విషాన్ని ఆవు పాలు విరుస్తాయనే దానికి రుజువేమిటి? సైన్సుగాని, చట్టంగాని రుజువు లేనిదే, దేనినీ అంగీకరించదు. రుజువు చేయలేని అంశాన్ని ఎలా రుజువుచేస్తాం?

*3. ఆవు మూత్రం విషపూరితమైన సూక్ష్మక్రిములను చంపుతుంది.* జంతువుది గానీ, మనిషిదిగానీ ఏ మూత్రమైనా బ్యాక్టీరియాను చంపుతుందనే విషయం అందరికీ తెలిసిందే. దానికి కారణం కూడా తెలిసిందే. మూత్రంలో ఉండే ఎసిడిటీ (తక్కువ పిహెచ్ విలువ), అమ్మోనియం సంయోగ పదార్థాలు బ్యాక్టీరియాను చంపుతాయి. ఆవు మూత్రంలో వేరే ప్రత్యేకత ఏమీ లేదు (ఏప్రిల్ 2012 నాటి 'ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ రీసెంట్ అడ్వాన్సెస్ ఫార్మాసుటికల్ రీసెర్చ్' అనే పత్రికలో ఎ.అహుజా సమర్పించిన పత్రం, 2(2): 84–87 నుండి).

*4. పది గ్రాముల ఆవు నెయ్యిని నిప్పుల్లో పోస్తే (యజ్ఞాలలో), ఒక టన్ను (1000 కేజీల) ఆక్సిజన్ వెలువడుతుంది.*

ఇది భౌతిక శాస్త్ర నియమాలకే విరుద్ధం. ఏ ప్రయోగంలోనైనా 10 గ్రాముల పదార్థం 1000 కిలోగ్రాముల పదార్థాన్ని సృష్టించలేదు.

మన పూర్వీకులైన మునులెప్పుడో కనుగొన్న విషయాన్ని శాస్త్రజ్ఞులు భవిష్యత్తులో ఎప్పుడో రుజువులు కనుగొంటారనో, వాళ్ళ ప్రకటనలను వ్యతిరేకించేవారు హిందూ నమ్మకాలకు వ్యతిరేకులనో విమర్శించడం సరైన చర్య కాదు.

సోషల్ మీడియాలో ప్రచారమౌతున్న అశాస్త్రీయ అంశాలను సమర్థవంతంగా ఎదుర్కోవడం దేశభక్తులందరి కర్తవ్యం.

***– డా॥ డి. బాలసుబ్రమణ్యన్***

ప్రముఖ శాస్త్రవేత్త , సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ మాజీ డైరెక్టర్,

*('ది హిందూ' సౌజన్యంతో)*

Editor, Printed & Published by : **K. Ayyanna,** Printed at MYTRI ART PRINTERS, Mahaboobnagar.